నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 15-12-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 99 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

మురికి కంపు
నినాదాలకు ఇంపు
రాచక న్యాయం.

గంతలు లేవు
రణాశ్వ ప్రహసనం
దక్కని చోటు.

నేడు కాల్బంతి
ఆటల్లో మహారాజు
అందని ద్రాక్ష.

నల్ల బంగారం
కిలో లక్షరూకలు
కేశ సౌందర్యం.

ఊలు పోగులు
చలిపులికి కళ్లెం
వెచ్చని చెలి.

– రేడియమ్
సెల్: 9291527757

నీనిజాయి

ఢిల్లీ రాజధానిలో
బీ ఆర్ ఎస్ జెండా !
జాతీయ పార్టీ పొంగి
పొరలె గుండె నిండా !

పయనమై వేసె పాగా
గులాబీల దండు !
ఆడ తేలె ఈడ మునిగి
అస్తిత్వపు బెండు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

అవినీతి రహిత భారత్ కై ఉద్యమిద్దాం

భారత దేశంలో అవినీతి అన్ని రంగాలలో అన్ని రకాల సేవల్లో పేరుకుపోయింది. రేషన్ కార్డ్ పొందడం నుండి పరిశ్రమలస్థాపన వరకు చిన్న చిన్న పనులు చేసే కాంట్రాక్టర్ల కు పనులు జరుగాలంటే అవినీతి ఒక సాధనం అయ్యింది. ప్రభుత్వ సేవలు అందించే ఉద్యోగులు సేవలు పొందే ప్రజల మధ్య అవినీతి రాజ్యమేలుతుంది. ప్రభుత్వం ఉచితంగా అందించే విద్య, వైద్యసేవల్లో లంచం ఇవ్వందే పనులు జరగని స్థితి నెలకొన్నది.

అవినీతి కి పాల్పడిన అధికారులను శిక్షించే చట్టాలు ఉన్నప్పటికీ 'హెచ్చరికలు చేసినప్పటికీ సమాజములో అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. అవినీతి అధికారం ఒకే నాణానికి రెండు ముఖాలుగా మారిపోయాయి.

అవినీతి పై అవగాహన చైతన్యం కలిగించడానికి అవినీతిని ఎదిరించి ఎలా పోరాడాలి అనే విషయాలపై అవగాహన కల్పించడానికి నిర్దేశించేది అంతర్జాతీయ అవినీతి వ్యతిరేఖ దినోత్సవం. దీనిని ప్రపంచమంతా జరుపుతారు. అవినీతి వల్ల జరుగుతున్న పరిణామాలు అవినీతిని అరికట్టడానికిఉన్న చట్టాల మీద అవగాహన తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. 2003లో 'ఐ రాస అక్టోబర్ 31న నిర్వహించిన అవినీతి వ్యతిరేక సదస్సులో ప్రతి ఏడాది డిసెంబర్ 9తేది నాడు ప్రపంచ వ్యాప్తంగా అవినీతి వ్యతిరేక దినోత్సవం జరుపుపాలని నిర్ణయించారు.

అవినీతి పేదరికం:

ప్రపంచములో అవినీతి లేని దేశం, రంగం లేదంటే అతిశయోక్తి కాదేమో అనిపిస్తుంది. ప్రపంచ మంతా అవినీతి మయమైంది. అవినీతి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు క్యాన్సర్లాగ పరిణమించింది. పేదల అభివృధి కొరకు అమలుచేసిన అభివృధి సంక్షేమ పథకాల ఫలితాలు లబ్ధిదారులకు అందని స్థితి నెలకొన్నది. పేదల అభివృధి కొరకు అమలుచేసిన అభివృద్ధి పథకాలలో అవినీతి చోటు చేసుకోవడం వల్ల వారి స్థితిగతులను మార్చడానికి చేపట్టిన చర్యలు 'పథకాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు .

పేదవర్గాల జీవన ప్రమాణాలు కొనుగోలు శక్తి పెరుగక "సామాన్యుని సాధికారిత" కలగానే మిగిలిపోయింది. అవినీతి నిర్మూలనకు వ్యతిరేకంగా ప్రభుత్వం ' ఎన్జీఓ లు' స్వచ్ఛంధ సంస్థలు సమిష్టిగా అవినీతి వ్యతిరేక పోరాటాలు చేసినప్పటికీ అవినీతిపై ప్రజలకు అవగాహన కలిపించే ప్రయత్నాలు చేసినప్పటికీ అవన్నీ ప్రజల అవసరాల ముందు పనిచేయని స్థితి నెలకొన్నది.

అవినీతి భారత్:

దేశంలో రాజకీయాలు' వ్యాపారాలు ప్రభుత్వ ఆఫీసులు :ప్రైవేట్ రంగాలు' ప్రతి రంగం ప్రతి. సేవా డబ్బులు ఇవ్వందే పని జరగని స్థాయికి చేరుకుంది ప్రభుత్వ నిధులు 'పాలసీలు' పథకాలు అల్లంత దూరాన ఆగిపోతున్నాయి.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే పలు అభివృధి సంక్షేమ పథకాల అమలులో జరుగుతున్న స్కాములు(కుంభకోణాలు) అవినీతి అడ్డగా మారి అభివృధి అడ్డుకుంటుంది.

అవినీతి గణాంకాలు భారత్

2012-2019 అధ్యయనం ప్రకారం మనదేశం(భారత్) అవినీతి ఎక్కువగా జరుగుతున్న దేశాల జాబితాలో వుంది . చైనా తో పోలిస్తే అభివృద్ధిలో మనదేశం వెనుకబడి ఉన్న అవినీతిలో మాత్రం మందంజలో వుంది. ప్రపంచములోనే అవినీతి బాగా ప్రభలిన దేశాలలో భారత దేశం ఉన్నది .

"ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ" అధ్యయనం ప్రకారం ప్రభుత్వ ఆఫీసుల్లో పని కావాలంటే పని కోసం 75 శాతం ప్రజలు లంచాలు చెల్లించు కోవాల్సి వస్తుందని. 2017 లో ప్రకటించిన ఈ సర్వేలో మన దేశం రాంక్ 94 వుంది." లంచం ఇవ్వడం పుచ్చుకోవడం నేరాలు" గా పరిగణించే చట్టాలు చుట్టబందలైనాయి. అవినీతికి పాల్పడిన ఉద్యోగిని ఉద్యోగం నుండి తొలగించడమే సరియైన శిక్ష అని సుప్రీమ్ కోర్టు పేర్కొంది.

ప్రపంచ అవినీతి సూచిక భారత్

2021లో ప్రపంచ అవినీతి సూచిక ప్రకారం. భారత దేశం ప్రపంచంలోని 180 దేశాల అవినీతితో పోలిస్తే మనదేశం 85వ స్థానం గత సంవత్సరం 183 దేశాలతో పోలిస్తే 95వ స్థానం శ్రీలంక 79వ స్థానం, చైనా 80.వ స్థానం 'డెన్మార్క్ ఫిన్లాండ్' న్యూజిలాండ్ స్వీడన్ సింగాపూర్ 'స్విడ్జర్లాండ్' దేశాలు అతి తక్కువ అవినీతి కలిగిన దేశాల జాబితాలో మొదటి 6 స్థానాల్లో ఉన్నాయి.

అవినీతి అభివృధికి అడ్డంకి

భారత దేశములో మౌలిక వసతులకల్పనకు ప్రతి యేటా రూ॥ 10 లక్షల కోట్లు రోజుకు రూ॥ 2750 కోట్లు గంటకు రూ"115 కోట్లు నిమిషానికి రూ॥1.80కొట్లుఖర్చు పెడుతున్నారు. దాదాపు 9 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారు.35 కోట్ల మంది నిరక్షరాస్యులు ఉన్నారు.52 కోట్ల మందికి రక్షిత మంచినీటి సౌకర్యం లేదు మరుగుదొడ్ల సౌకర్యం లేదు ప్రతి పథకంలో అవినీతి ప్రభలిపోయింది. ఎయిడ్స్ మహమ్మారి కన్న.ఎక్కువగ వేగంగా వ్యాపిస్తుంది అదుపు లేని పెనుభూతంగా అవినీతి పెరిగి అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుంది.

2007 లో ఢిల్లీకి చెందిన "ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ & సెంటర్ ఫర్ మీడియా స్టడీస్" సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో 11 ప్రజాసేవా అంశాల్లో ఏదో ఒకదానిని పొందేందుకు మూడువంతులు మంది నిరుపేదలు ఏడాదికి రూ॥ 900కోట్లు చెల్లించినట్లు తేలింది.

2009 లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం భారత దేశం 542 మంది ఎంపిలలో 120.మంది ఎంపిల మీద (నాలుగో వంతు) క్రిమినల్ చార్జీలు ఎదురుకుంటున్నట్లు 2008 లో.వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. మనుషులని అక్రమంగా తరలించడం, ఇమ్మిగ్రేషన్ నిభందనల ఉల్లంఘన' రేప్ హత్యలాంటి ఆరోపణలు ఇందులో ఉన్నాయి. 1948 నుండి 2008 నాటికి దేశం నుండి రూ॥ 20లక్షల కోట్ల మేరకు డబ్బు అక్రమంగా విదేశాలకు చేరుకున్నట్లు అంచనా.

అవినీతి ప్రభుత్వ రంగ సంస్థలు

భారత దేశములో ప్రభుత్వ, రంగ సంస్థలు ఆఫీసులు అవినీతికి అడ్డాగా మారినాయి. ప్రజా పనులు రోడ్లు కాలువల తవ్వకం నీటి వనరులు ఆనకట్టల నిర్మాణం .గిడ్డంగుల నిర్మాణం రైల్వే ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రతి దశలో టెండర్ దశ వరకు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా మారింది చేసిన పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడం ప్రభుత్వ అధికారులు కాంట్రాక్టర్లు చేతులు కలపడం అవినీతికి పాల్పడటం వల్ల ఫలితంగా రోడ్స్ ప్రభుత్వ భవనాలు ప్రాజెక్టులు ఆనకట్టలు త్వరగా పాడైపోయి. కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా అవుతుంది .

మారని ప్రభుత్వ అధికారులు

రవాణా రంగం 'ఆదాయ పన్ను శాఖ రెవెన్యూ డిపార్ట్మెంట్' సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు 'గనులు కరెంట్' సివిల్ సప్లై డిపార్ట్మెంట్ పోలీస్ శాఖ , పంచాయతి రాజ్ విభాగాలలో అవినీతి తీవ్ర స్థాయిలో వున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి.

ఇటీవల కాలములో తెలంగాణ వ్యాప్తంగా అవినీతి అధికారులను పట్టుకుంటున్న అధికారులలో మార్పు రాలేదు. భూమి పత్రాలు ఇవ్వడం పాస్ పుస్తకాలు భూమిసర్వే పనుల్లో అధికారుల చేతులు తడపనిదే పని కావడం లేదు.

అవినీతి నిర్మూలన మార్గాలు

అవినీతి వ్యతిరేకతకు ప్రతి కుటుంబం యూనిట్ కావాలి

నీతి నిజాయితీ మానవీయ విలువలు పాటశాల, కళాశాల స్థాయిలో పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టి విద్యార్థుల్లో యువతలో అవినీతి నిర్మూలన చట్టాల మీద సదస్సులు సమావేశాలు నిర్వహించాలి.

నీతి నిజాయితీ చట్టబద్ధ పాలన జవాబుదారీ తనం పాటించిన నిజాయితీ గల ఉద్యోగులకు అవార్డ్స్ ఇవ్వాలి. అవినీతి కి పాల్పడిన అధికారులను అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టిచ్చిన వ్యక్తిని స్వచంద సంస్థలకు ప్రభుత్వం అవార్డ్స్ ఇవ్వాలి.

ప్రతి ప్రభుత్వ ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అవినీతి నిర్మూలన మార్గాలమీద సమావేశాలు నిర్వహించాలి.

నిర్ణీతకాలవ్యవధిలో ఉద్యోగులు తమ బాధ్యతలు నిర్వహించే పాలనా పరమైన సంస్కరణలు చేపట్టాలి.

కేంద్ర స్థాయిలో అవినీతి నిరోధక విభాగం ఏర్పాటు' లోకాయుక్త అంబుడ్జెమెన్ వ్యవస్థలు సమాచార హక్కు చట్టం సిటిజెన్.చార్టర్ ఏర్పాటు 'ఫిఫ్త్ పిల్లర్ అనే సంస్థ జీరో రూపీ నోట్లను జారీచేసింది. ఎవరైన లంచం అడిగితే ఈ నోట్లను ఇవ్వాల్సిందిగా సూచించింది. లంచం తీసుకోవడం నేరం అనే హెచ్చరిక ఆ నోట్ల పై ఉంటుంది.

అవినీతి జవాబుదారీతనం

ప్రజలలో ప్రశ్నించే తత్వం పాలకులలో అధికారులలో జవాబుదారితనం పారదార్శనికత పెరిగినపుడు మాత్రమే అవినీతి తగ్గుతుంది. ప్రభుత్వ రంగం సంస్థలు విడుదల చేస్తున్న నిధులు పనితీరును పారదర్శకంగా చూప కలిగితె కొంత మేరకు అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చు. సమాచార హక్కు చట్టం అనేది ప్రతి భారతీయుని చేతిలో ఆయుధం వంటిది. దీని ద్వారా సమాచారాన్ని సేకరించి కోర్టులలో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేయడం ద్వారా అవినీతిని బట్ట బయలు చేయవచ్చు.తర్వాత కాలములో అవినీతి తగ్గుముఖం పడుతుంది.

అవినీతి ఎన్నికల సంస్కరణలు

చట్ట సభలకు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు నీతి నిజాయితీ పరులకు టికెట్లు ఇచ్చి

రాజకీయ రంగములో జరుగుతున్న ధన ప్రాబల్యం అడ్డుకోవాలి. అవినీతి కార్యక్రమాలకు పాల్పడిన అభ్యర్థులకు టికెట్లు ఇవ్వకూడదు

ఎన్నికల సమయములో నోటుకు ఓటు కొనే సంస్కృతిని ఎన్నికల కమిషన్ అడ్డుకోవాలి. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన దాని కన్నా ఎక్కువ ఖర్చు చేస్తే ఆర్థిక ప్రలోభాలతో ఓటర్లను ఆకర్షించేందుకు చేసే అవినీతి అక్రమ కార్యకలాపాలను నిషేధిస్తూ

ఎన్నికల సంస్కరణలు ప్రభుత్వం చేపట్టి అమలు చెయ్యాలి. ప్రజాస్వామ్యంలో ధన స్వాముల ప్రవేశం అడ్డుకోవాలి అక్రమాలకు అవినీతికి కుంభకోణాల్లో చిక్కుకున్న వారిని అవినీతి ఆరోపణలు వున్న వారు చట్ట సభ సభ్యులుగా ఎన్నిక కావడానికి అనర్హులుగా ప్రకటించాలి

అవినీతి నేరమయ రాజకీయాలు

నేరమయ చరిత్ర వున్న వ్యక్తులు చట్ట సభలకు ప్రతినిధులుగా పోటీ చేయడాన్ని నిషేధించే చట్టాలను ఎన్నికల సంస్కరణలు ప్రవేశ పెట్టి

నీతి వంతులు సమర్థులు ప్రజా ప్రతినిధులు గా ఎన్నికయ్యే వాతావరణం కలిపిస్తే రాజకీయ అవినీతి సాంద్రత తగ్గుతుంది.

అవినీతి డిజిటల్ టెక్నాలజీ

ప్రభుత్వ రంగం ప్రైవేట్ రంగములో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని డిజిటల్ టెక్నాలజీ వినియోగించి అవినీతిని అరికట్టేందుకు బహుముఖ చర్యలు తీసుకోవాలి

అవినీతి వినియోగదారుల చైతన్యం

వస్తు సేవల క్రయ విక్రయాలలో వినియోగదారులు తప్పని సరిగా రసీదులు పొంది వినియోగదారులు తమ హక్కుల పరిరక్షణ కు పాటుపడాలి మార్కెట్లో జరుగుతున్న మోసాలను అడ్డుకొని వ్యాపార రంగములో జరుగుతున్న అవినీతి నిర్మూలనలో ప్రతి వ్యక్తి చైతన్య వంతమైన పాత్ర పోషించి అడ్డు అదుపు లేకుండా విస్తరిస్తున్న అవినీతిని అడ్డుకోవాలి. నిరంతర అప్రమత్తత తో అవినీతి అంతానికి పాటుపడాలి.

అవినీతి చట్టాలపై అవగాహన

సమాచార హక్కు చట్టం పట్ల అందరూ అవగాహన పెంచుకొని ప్రజా పనుల్లో జరుగుతున్న అవినీతిని ఎక్కడికక్కడ నిలదీయాలి. అవినీతి నిర్మూలన సుశ్రీప్రతి పౌరుడు సామాజికభాద్యతగా స్వీకరించాలి.

ఎవ్వరో వస్తారని ఎదో చేస్తారని ఎదిరి చూడకుండా ప్రతి పౌరుడు చైతన్య వంతమై అవినీతి నిర్మూలన లో క్రమశిక్షణ గల సైనికునిగా పనిచేయాలి "లంచం ఇవ్వడం తీసుకోవడం నేరం" 'అనే భావన అందరిలో రావాలి. అవినీతి నిర్మూలనచట్టాల పై అవగాహన పెంచుకుందాం దేశాన్ని 'రాష్ట్రాన్ని "అవినీతి రహితంగా "మార్చుదాం అవినీతి అక్రమాల మీద ప్రజలను చైతన్య పరుస్తూప్రభుత్వం 'పౌరసమాజం' మహిళా యువత 'ధార్మిక 'స్వచ్ఛంధ సంస్థలు సమిష్టిగా ఉద్యమించి అవినీతి రహిత భారత్ నిర్మాణానికి పునరంకితమౌధాం అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం. అవినీతి అంతం మన పంతం కావాలి.

అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం అంటే కేవలం అవినీతి నిఅరికట్టే విధానాలు తెలుసుకొనితర్వాత రోజు మరిచిపోయి మళ్ళీ అవినీతికి పాలుపడకుండ ప్రపంచములోని ప్రతి దేశ ప్రభుత్వం, ప్రతి పౌరుడు అవినీతి నిర్మూలనేలక్ష్యంగా ఉద్యమిస్తే అవినీతి రహిత సమాజం ఆవిర్భవిస్తుంది.

–నేదునూరి కనకయ్య
9440245771

బుధవారంరోజు లుంబిని వనంలో మహాకవి డా॥ కత్తి పద్మారావును కలిసి ఆత్మీయ సత్కారం చేస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

హస్తినలో బీఆర్ఎస్ ఆఫీసును ప్రారంభించిన సీఎం కేసీఆర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:దేశ రాజకీయాల్లో అపూర్వఘట్టం ఆవిష్కృతమైంది. దేశంలో గుణాత్మక మార్పు కోసం నడుంకట్టిన తెలంగాణ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. బుధవారం ఢిల్లీలో పార్టీ జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా పార్టీ జాతీయ జెండాను కేసీఆర్ ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించి, కేసీఆర్ ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు జాతీయ, రాష్ట్ర నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, జేడీఎస్ అధినేత, కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి, తమిళనాడుకు చెందిన విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ ఎంపీ చిదంబరం, పలు రాష్ట్రాల రైతు సంఘం నాయకులతో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం కంటే ముందు.. రాజశ్యామల యాగం పూర్ణాహుతికి ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించేందుకు తెలంగాణ రాష్ట్ర సమితి పేరును ఇటీవలే భారత రాష్ట్ర సమితిగా మార్చిన విషయం తెలిసిందే.

ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఫిరోజాబాద్ సమీపంలోని ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం తెల్లవారుజామున వేగంగా వస్తున్న ట్రక్కు బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

ఓ బస్సు 60 మంది ప్రయాణికులతో పంజాబ్ రాష్ట్రమైన లుధియాన (ఒబీటష్ట్రతిజీనిజీ) నుంచి ఉత్తర్‌ప్రదేశ్ లోని రాయ్‌బరేలీ కి వెళ్తోంది. ఈ క్రమంలో తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపైకి రాగానే వేగంగా వస్తున్న డీసీఎం వాహనం బస్సును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. 22 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దేశహితం కోసం కేసీఆర్ నూతన రాజకీయ ఒరవడి : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 14:ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం సందర్భంగా పార్టీ శ్రేణులకు మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్.. దేశంలో గుణాత్మక మార్పు కోసం జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారని తెలిపారు. ఆనాడు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం విప్లవాత్మక పంథాను అనుసరించారో, ఇవాళ దేశహితం కోసం నూతన రాజకీయ ఒరవడిని కేసీఆర్ ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ ప్రత్యేక అనుమతితో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరు కాలేకపోతున్నానని వెల్లడించారు. ముందే నిర్ణయించబడిన రెండు కీలకమైన పెట్టుబడి సమావేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సిరిసిల్లలో సెస్ ఎన్నికల నామినేషన్లు కూడా ఈ రోజే ఉన్నాయని కేటీఆర్ గుర్తు చేశారు.

ఇంధన పరిరక్షణలో తెలంగాణకు మరో జాతీయ అవార్డు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ఇంధన పరిరక్షణ రంగంలో చేస్తున్న కృషికి గాను తెలంగాణకు మరో జాతీయ అవార్డు వరించింది. గ్రూప్ 2లోని రాష్ట్రాల్లో తెలంగాణకు నిర్దేశిత సంస్థగా ఉన్న తెలంగాణ పునరుత్పాధక ఇంధన అభివృద్ధి సంస్థ(రెడ్కో) సర్టిఫికేట్ ఆఫ్ మెరిట్ అవార్డు అందుకుంది. 32వ జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి రాజ్ కుమార్ సింగ్ చేతుల మీదుగా తెలంగాణ రెడ్కో చైర్మన్ వై.సతీశ్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య ఈ అవార్డును అందుకున్నారు.

చైర్మన్ సతీశ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రెడ్కో సంస్థ పర్యావరణ పరిరక్షణలో భాగంగా కర్బన ఉద్గారాల వాడకాన్ని తగ్గించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ ను మున్సిపల్ యాక్ట్ లో చేర్చిన రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించిందన్నారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించేలా భవన నిర్మాణ దశ నుంచే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పరిశ్రమల్లోనూ విద్యుత్ ఆదా అయ్యే విధంగా యంత్రాల వినియోగం, మార్పులపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంలో నాసిరకం మోటార్లతో అధిక విద్యుత్ వినియోగం జరగకుండా వాటి స్థానంలో స్టార్ రేటెడ్ మోటార్ల ఏర్పాటుకు రైతులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పోస్టాఫీసులు, పోలీస్ స్టేషన్లు, స్కూళ్లు, దేవాలయాల్లో తక్కువ విద్యుత్ తో పనిచేసే ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటన్నింటిని గుర్తించిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ రాష్ట్రానికి అవార్డు ప్రకటించిందని తెలిపారు. సంస్థకు వెన్నంటి ఉండి సహాయసహకారాలు అందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ , ఐటీ మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

'తెలంగాణ బిట్ బ్యాంక్' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్, నలిమెల భాస్కర్, బాలాచారి, తంగిరాల చక్రవర్తి, చంద్రమోహన్. కోట్ల వెంకటేశ్వర రెడ్డి తదితరులు

తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్రను విద్యార్థులు లోతుగా అధ్యయనం చేసినప్పుడే స్థానిక విషయాలు తెలుస్తాయని సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలోని అకాడమీ కార్యాలయంలో 'తెలంగాణ బిట్ బ్యాంక్' పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త నిలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలనుకొనే విద్యార్థులు అన్ని జిల్లాల చరిత్ర చదవాలన్నారు. నలిమెల భాస్కర్ మాట్లాడుతూ చారిత్రక సాంస్కృతిక వైభవాన్ని పదిలపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అకాడమీ కార్యదర్శి నమోజు బాలాచారి, పుస్తక సంపాదకులు తంగిరాల చక్రవర్తి, కోయచంద్రమోహన్, కవి కోట్ల వెంకటేశ్వర రెడ్డి, సాహితీ విమర్శకులు కె.పి. అశోక్‌కుమార్, జర్నలిస్టు సాధిక్ పాల్గొన్నారు.

కళలను కళాకారులను ప్రోత్సహిస్తున్న తెలంగాణ-మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కళాకారులను సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, డా॥ మామిడి హరికృష్ణ తదితరులు

కళలను ప్రోత్సహించడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందున్నదని రాష్ట్ర సాంస్కృతిక శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినయ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల జాతీయ నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలి రోజు మణిపూర్‌కు చెందిన కళాకారులు రిక్షా అనూసింగ్ నాంగ్మీ నాటకం ప్రదర్శించారు. ఈ నాటకానికి డా॥ ఎస్. ధనింలెమయ దర్శకత్వం వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కళాకారులను సత్కరించి నాటకోత్సవ నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులను నగరానికి రప్పించి జాతీయ నాటకోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, తెలంగాణ నాటకసమాజాల సమాఖ్య అధ్యక్షుడు తమకమళ్ల రామచంద్రరావు, బి.ఎం.రెడ్డి, పద్మప్రియ పాల్గొని నాటకోత్సవ నిర్వాహకుడు అభినయ శ్రీనివాస్‌ను అభినందించారు. సభకు ముందు ప్రదర్శించిన నాటకం ప్రేక్షకుల్ని అలరించింది.

'ఎగిరిపోయిన పిట్ట', 'మహిశోద్ధారకులు' పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డా॥ ఎన్.గోపి తదితరులు.

కొసరాజు సామ్రాజ్యం సంకలనపరిచిన **'ఎగిరిపోయిన పిట్ట'** కవితా సంకలనం, కుమ్మమూరి (పొత్తూరి) సుబ్బాయమ్మ రచించిన **'మహిశోద్ధారకులు'** వ్యాస సంపుటిని తెలుగు వర్సిటీ పూర్వ వీసీ డాక్టర్ ఎన్.గోపి సోమవారం ఆవిష్కరించారు. త్యాగరాయ గానసభలో డా॥ మామిడి హరికృష్ణ తదిరతులు రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి సాహితీవేత్త వై. రామకృష్ణారావు మాట్లాడుతూ ఎగిరిపోయిన పిట్ట కవితా సంపుటిలోని అంశాలు వైవిధ్యభరితంగా ఉన్నాయన్నారు. రమణ వెలమకన్ని,గుదిబండి వెంకట రెడ్డి, పొత్తూరి సుబ్బారావు, దుర్గ, దత్తాత్రేయశర్మ, వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.

అనురాగం!

గజల్

మత్లా: అందరినీ ఆదరిస్తే అనురాగం అంటాను!
అహంతో చీదరిస్తే పెనురోగం అంటాను! ॥అం॥

మొక్కలనే ఎల్లెడలా నాటేస్తూ పోషిస్తే
'హరిత హార' పథకంతో ఒక యాగం అంటాను!
చిన్నారుల అభివృద్ధికి దీక్షగా కృషిచేస్తే
భావి పౌరులా భవితకు సన్మార్గం అంటాను!
'నోటు' కొరకు మంచి మరచి దుష్టులకే ఓటేస్తే
ప్రజాస్వామ్య పతనానికి దుర్మార్గం అంటాను!
భర్తను పిల్లల్ని ఎపుడు బాధ్యతగా సేవించే
భార్యనే కలిగుంటే అది భోగం అంటాను!
ఎల్లవేళ ఇల్లాలికి ఎడతెగకా ప్రేమించే
భర్తయే తోడుంటే మహయోగం అంటాను!

మక్తా: ఈర్ష్యా ద్వేషాలు రగులు మిత్రులతో కలిసుంటే
'వడ్డెపల్లి' వైరులతో సంభోగం అంటాను!

– డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

చరిత్రలో నేటినిజం

నేటినిజం
సాహితీ కెరటాలు
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 15-12-2022

నానీలు

నే ల తల్లి
విలపిస్తోంది
కాలుష్య గరళం
దిగమింగలేక..

మా నవత్వం కోసం
వెతుకుతున్నావా!
ముందు
మనిషిగా మసలు

వ్యవసాయమూ
జూదమే
పంటదక్కేది లేనిది
చివరి దాకా తెలియదు.

వృద్ధాశమాలూ
ఆకలి చావులూ
నిరంతర
జీవనదులు..

-బొమ్ము ఉమా
మహేశ్వర రెడ్డి
సెల్:94402 14705

గుంటూరోం

ఉ న్నదాన్ని చూసి
విర్రవీగకు
ఉన్నది వేరవుతుందని
మరువకు.

అ ధికారం
అద్దాలమేడ
యుద్ధాల
చదరంగ క్రీడ.

అ బద్ధాలు హద్దులు
దాటితే ఎలా?
పోగొట్టుకున్న నమ్మకాన్ని
రాబట్టుకోలేము కదా.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

జీవిత తత్వం తెలిసిన కవి

ఈనెల 18న రాష్ట్ర ప్రభుత్వ నలహాదారులు డా॥కె.వి.రమణాచారి ఆవిష్కరించనున్న దాస్యం సేనాధిపతి కవిత్వం "ఇప్పుడిప్పుడే" పుస్తకానికి డా॥అమ్మంగి వేణుగోపాల్ రాసిన ముందుమాట

దాస్యం సేనాధిపతి గారి కలంలో సున్నితపు త్రాసులుంటాయనిపిస్తుంది. అందుకే భావము... భాష రెండు సమతుల్యత కలిగి కవిత్వం విలువను పెంచుతుంటాయి. ఈ లక్షణం సాధారణ కవులలో తక్కువ. కవి చేసేది అక్షరాల వ్యవసాయం. మీద నక్షత్రాల ఆకాశం, కింద పూలు విరిసిన ఉద్యానవనం. ఎప్పుడూ కవ్విస్తుంటాయి కవిని. సౌందర్యదాహంతో పరితపించే కవికి కవిత్వరచన మంచి సాధన. కష్టసుఖాల జీవితాన్నే కవి కూడా ప్రదర్శిస్తాడు. కాకపోతే లయాత్మకంగా, కళాత్మకంగా.

సమాచార సాంకేతిక రంగాలలో సెల్‌ఫోన్ విప్లవాన్ని సృష్టించింది. అట్లాగే మానవ సంబంధాల మధ్య ఇటు మంచికి అటు చెడుకు దోహదం చేసే సాధనమయింది. సేనాధిపతి గారి **"ఇప్పుడిప్పుడే..."** అన్న వచన కవితా సంపుటి ప్రారంభ కవిత 'లేడీ టీచర్' పిల్లలతో అక్షరాలు దిద్దించటం దగ్గర నుండి ఏ స్థాయి వాళ్ళకు ఆ స్థాయి పాఠాలు చెప్తున్నా తాను ఉన్నచోటే ఉండిపోతుంది. టీచర్‌కు ముందున్న 'లేడీ' అన్న విశేషణం జెండర్‌ను తెలియజేస్తుంది. అనాదిగా స్త్రీ కష్ట పడుతూనే ఉంది. కాని ఫలితం మాత్రం భర్త పొందుతున్నాడు. ఈ ప్రవర్తనలో పురుషాధిక్యత ఉంది. ఇది స్త్రీని బానిసను చేస్తున్నది. ఈ పునర్ పునర్నిరూపిత సత్యాన్ని ఆధునిక సందర్భంలో, ఆధునిక భాషలో కవి ఎంత బాగా వ్యక్తం చేశాడో చూడండి :

"పేరుకే జీతం ఆమె ఖాతాలో జమ
ఏ టీ ఎం కార్డు మాత్రం
భర్త జేబులోనే సుమా !"

సమయ సందర్భాలను బట్టి దోపిడీ పద్ధతులు మారుతుంటాయి. ఇక్కడ ఏటీఎం కార్డు భార్యకు ప్రతీక. అంటే ఆమె ఎప్పుడూ అతని జేబులోనే, అతని ఆర్థిక అవసరాలు తీర్చే బానిసగానే ఉంటున్నది. ఇక్కడ భర్తను గూర్చిన వర్ణన ఇంతకంటే ఎక్కువ లేదు. అవసరం కూడా లేదు. రెండు మాటలతో భర్త ఏకపక్ష పాత్రను రూపు కట్టించాడు కవి. ఆమె భర్తకు తప్ప అందరికీ పాఠాలు చెప్పగలుగుతున్నది.

సాధారణంగా కవులు తమ తాతమీద కవిత్వం రాస్తుంటారు. అవి ఒక బాల్యస్మృతి రూపంలో ఉంటుంది. కాని సేనాధిపతి గారి దృష్టి విలక్షణంగా తాత చెప్పుల మీద పడింది. తాత లేడు, కాని తాత చెప్పులున్నాయి.

"ఆయన పాద ధూళిని
సుగంధ పరిమళంగా అద్దుకున్న ఘనత'

ఆ చెప్పులకుందట. ఆ చెప్పులు కొడుకులుగా మానవీకరణ పొందాయం టున్నారు కవి. మామూలుగా కవులు పెద్దవాళ్ళ అడుగుజాడల వర్ణన చేస్తుంటారు. ఆ అడుగుజాడలు దిక్సూచులుగా నేలమీద అచ్చు పడుతున్నాయని కూడా వర్ణిస్తుంటారు. కాని ఇక్కడ కవి కొత్తగా –

''అచ్చయిన ఆయన పాద ముద్రలు
వీటిలో భద్రంగా ఉన్నాయి!"

అంటున్నారు. చాలా సంవత్సరాలుగా ఒకే చెప్పుల జతను వాడుతుంటే ఆ పాదాల ముద్రలు ఆ చెప్పుల పైభాగంలో అచ్చవుతుంటాయి. నేలమీద పడే చెప్పుల ముద్రలు చెరిగిపోతాయి కాని, చెప్పుల మీది పాదముద్రలు చెరిగిపోవు. అవి 'పచ్చబొట్టు'లా ఉంటాయంటున్నారు. కవి సేనాధిపతిగారి ఈ పరిశీలనాత్మక దృష్టి కొత్తది.

సాధారణంగా కవులకు అమ్మపట్ల ప్రేమాస్పదమైన భావుకతతో కూడిన ఊహలు, నాన్న పట్ల జీవితానుభవం గరిపే గురువు పట్ల ఉన్న గౌరవ భావం ఉంటాయి. సేనాధిపతిగారు రాసిన 'అమ్మంటే', 'మా బాపు' అన్న కవితల్లో ఇవే భావాలు కనిపిస్తాయి. అంతటి అమ్మ –

"జీవన సంధ్యలో
తన వారి ఆదరణ కరువై
వృద్ధాశ్రమంలో బొమ్మై కూర్చుంది !
కవిత్వంలో మాత్రం
కదలాడే దేవతగా
ఆవిష్కరింపబడుతుంది !"

అంటారు కవి. తనవారికి దూరంగా ఆశ్రమాల్లో ఉండిపోవలసిన వైపరీత్యానికి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ శిథిలం కావటం, కొడుకులు ఉద్యోగరీత్యా సుదూరాల్లో ఉండటం



ప్రధాన కారణాలు. ఇవే కారణాల దృష్ట్యా తండ్రికి కూడా వృద్ధాశ్రమ జీవితం తప్పనిసరి కావచ్చు. కాని కవికి తల్లి పట్ల ఉన్న ప్రేమ తండ్రి పట్ల ఉండక పోవచ్చు.

'శబ్దలయ' లోతున్న కవిత. శబ్దానికి చాలా అర్థాలున్నాయి. 'ధ్వని', 'మాట' అన్నవి ప్రసిద్ధం. మనం జీవిస్తున్నది శబ్ద ప్రపంచంలో. ఈ ధ్వనిని శబ్దబ్రహ్మ అనటం కద్దు. ఆనందవర్ధనాచార్యులు ప్రతిపాదించినది ధ్వని సిద్ధాంతం. 'సంగీత శాస్త్రంలో గానంతో చేరి హెచ్చుతగ్గు లేక నడిచేది లయ. నృత్యగీత వాద్యాదుల సమన్వితమే లయ' అంటున్నారు ప్రముఖ పరిశోధకులు ప్రొ. జి. చెన్నకేశవరెడ్డి గారు. లయను ఆంగ్లంలో స్ట్రనీగిశనీళీ అంటారు. సమాచార వినిమయంలో, కావ్యార్థ సాధనలో శబ్దానిదే కీలకం. అందుకే సేనాధిపతి గారు –

'ఈ ప్రపంచం
నా శబ్దం'

అంటున్నారు, మానవ జాతి ప్రతినిధిగా. ఇంకొంచెం ముందుకు వెళ్ళి

'ఈ విశాల విశ్వంలో
కనిపించే ప్రతి దృశ్యం
నా శబ్దం '

అంటూ దృశ్యాలతో మమేకమయ్యే కవి, వాటితో తాను నిశ్శబ్దంగా మాట్లాడ తానని కూడా భావుకంగా చెప్తున్నాడు. దృశ్యం కంటికి కనిపించేదే అయినా కవి తన కవితాశక్తితో వీనుల విందు చేస్తున్నారు. అంతేనా ! కవులు సహజంగా తమ కవిత్వంలో చిత్రించే 'భావ చిత్రాలను' –

'శబ్ద లయతో
నా శబ్దంగా
అలరింప అరాట పడతాను'

అంటూ సమన్వయం చేసే ప్రయత్నం చేస్తున్నారు.

సేనాధిపతి గారి కవిత్వంలో ఎక్కువ ఆర్భాటం, అట్టహాసం ఉండవు. చాలా కవితలు మంచులో తడిసిన పూలలాగా గుబాళిస్తాయి. ప్రకృతిని, ప్రేమను ప్రేమిస్తారు. శిథిలమవుతున్న మానవ సంబంధాల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తారు. ప్రకృతిని మానవీకరించి చూపుతారు. జీవితం ఇంతకన్నా బాగుండాలని కోరుకుంటారు. చాలా కవితల్లో ఈ ఆకాంక్ష వెల్లడయింది. ఏ కవైనా వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలకు అనుకూలంగా ఉండాలని కోరుకుంటారు. సేనాధిపతి కూడా ప్రజాపక్షపాతే.

కవిగా, విమర్శకునిగా, సమీక్షకునిగా, కథకునిగా, శీర్షికా నిర్వాహకునిగా, వక్తగా దశాబ్దాలుగా సాహిత్యరంగానికి సేవ లందిస్తున్నవారు దాస్యం సేనాధిపతి గారు. పీజీ కేంద్రాలలో, విశ్వవిద్యాలయ శాఖల్లో పనిచేసి విస్తృతానుభవం గడించిన వారు. తాము అప్పుడప్పుడు రాస్తూ వచ్చిన కవితలను "ఇప్పుడిప్పుడే..'' అన్న పేరుతో ప్రచురిస్తున్నందుకు అభినందనలు. మరో కవితా సంపుటి ఎప్పుడెప్పుడా అని పాఠకులు ఎదురుచూసే రీతిలో ఇది ఉండటం వల్ల పాఠకుల ఉల్లమెరిగిన కవిగా సేనాధిపతి గారు తొందరలోనే మరో కవితా సంపుటి ప్రచురిస్తారని ఆశిద్దాం.

-డా॥ అమ్మంగి వేణుగోపాల్.

పుస్తక సమీక్ష

క్రొత్త పరిమళాలు కథా సౌరభాలు

లాభ నష్టాల వేపు దృష్టి పోనీయకుండా గత 5 సంవత్సరాల నుండి, వర్ధమాన మరియు లబ్ధ ప్రతిష్ఠుల నుండి కథలను సేకరిస్తూ సంకలనాలను వెలువరిస్తున్నారు ఎన్.కె. పబ్లికేషన్స్ వారు. మొదట **"నాకు నచ్చిన నా కథ"** శీర్షికతో వెలువరించినా ఈ సంకలనానికి **"కథా సౌరభాలు"** అన్న పేరు నిశ్చయం చేసారు.

ఎన్.కె. బాబు సంపాదకత్వంలో వెలువడిన ప్రస్తుత సంకలనంలో 41 మంది కథకుల నుండి స్వీకరించిన 41 కథలున్నాయి. ఇందులో యండమూరి దాట్ల దేవదానం రాజు,మల్లాది లాంటి సీనియర్ రచయితలున్నారు.

ఇప్పుడిప్పుడే కలం పట్టిన ఔత్సాహిక రచయితలూ ఉన్నారు. దివి సీమ ఉప్పెన (కథాకాలం 1977) నుండి కరోనా విలయం (2019) వరకు వ్రాసిన కథలున్నాయి. కథలు ఎలా వ్రాయాలి? అన్న ప్రశ్న వేసుకుని 'కథా ఆరంగేట్రం' చేయబూనే రచయితలకు ఈ సంకలనం ఒక మంచి పరిశీలనా గ్రంథంగా పేర్కొనవచ్చును.

నిన్న మొన్నటి వరకు కరోనా రక్కసి మనల్ని పీడించిన సంగతి, అది అవకాశంగా తీసుకుని హాస్పిటల్ జనం జనాన్నిజలగల్లా పీడించి పిండుకున్న సంగతి **"కరోనా మంటల్లో"** వివరించబడింది. కరోనా కష్టకాలం లో Organised దోపిడి కార్పొరేట్ హాస్పిటల్లు చేస్తే, తక్కువ తినని హాస్పిటల్ సిబ్బంది, కరోనా కంటే దారుణంగా బాధితుల్ని బాధితుల బంధువుల్ని ఎలా దోచుకున్నారో తెలుపుతుంది ఈ కథ. మాయదారి రోగం మనుషుల్లో మానవత్వాన్ని మంటగలిపింది. ఆ మహమ్మారి విలయ తాండవానికి బలియైన బక్కపాణులు అలివేణిలాంటి వారు ఎందరో! కథ కథనం బావుంది.

ఒక నీతిపరుడైన 'అధికారి– అవినీతికి ప్రోత్సాహం, 'చెయ్యాసర' ఇవ్వాల్సిన విపత్కర పరిస్థితులు దాపురిస్తే.. ఆ అధికారి తన విలువలకు తిలోదకాలివ్వకుండా ఎలా స్పందించారో **"మనం మనం బరంపురం"** కథ చెబుతుంది.

కొసమెరుపు పాఠకుడిని నిశ్చేష్టుడిని చేస్తుంది. కథ మరి కొంచెం పొడిగించి, ఆ అధికారి అన్యాయంపై విజయం సాధించినట్లు చెబితే మరింత మంచి సందేశం ఇచ్చినట్లుండేది.

స్థాయికి మించిన కొరకే కాంతా నిది. నిజానికి అదేం పెద్ద కోరిక కాదు. ఎలాగో తంటాలు పడి ఎటెం డర్ శ్రీరాములు తన భార్య కాంతం ఎప్పటి నుండో కోరుకున్న పట్టుచీర కొంటాడు. తీరా కొన్నాక అసలు ఇబ్బంది మొదలవుతుంది. చివరకు కాంతంతో **"వెధవ చీర"** అనిపించుతుంది. బొడ్డు కూర్మారావు వ్రాసిన **'తెల్ల ఏనుగు'** ముగింపు వాక్యాలు బావున్నాయి. ఒకతరం క్రిందటి కథ ఇది. అయినా ఎన్నుకున్న "థీం" ఈనాటికి కూడా అన్వయిస్తుంది. కథనం కథ చదివాక దంపతులు శ్రీరాములు కాంతం మీద పాఠకులకు బోలెడంత సానుభూతి కలుగుతుంది.

ఆదిత్య అపర్ణలు పరస్పరం ప్రేమించుకున్న కాలేజీ విద్యార్థులు, తెలివిగా ఆదిత్య తలిదండ్రుల చేత అపర్ణను ఎలా ఒకే చేపించుతారో వివరించిన తీరు "క్యాంపస్ సెలెక్షన్'' కథలో మనం చదువుతాము. పిల్లల



గడుసుదనానికి ఆదిత్య తలిదండ్రులే కాదు, మనం కూడా ముక్కున వేలేసుకుంటాము.

ఒక తాత, మనవరాలు చుట్టు అల్లబడిన కథ దాట్ల దేవదానంరాజు గారి **'ఆరిందా'.** ఆసక్తిగల విషయాలు మొబైల్ కంప్యూటర్ వంటి అధునాతన సౌకర్యాలను పిల్లలు ఎంత త్వరగా అందిపుచ్చుకుంటారో, చుట్టూ ఉన్న సంగతులను ఎంత వేగంగా నిక్షిప్తం చేసుకుంటారో ఈ కథ తెలుపుతుంది. సామాన్యమైన సంఘటనలే! అయినా రాజుగారు కథలో వివరించిన తీరు అద్భుతం! చిన్ని బుర్రలోని ఆలోచనలు లాజిక్‌కు నిలవ్వు. గణపతి నవరాత్రుల తర్వాత దేవుడైన ఆ గణపతిని నిమజ్జనం చేస్తారు.

"పుస్తకాలు కూడా దేవుడు అన్నారు కదా నిమజ్జనం చేసేద్దామా?'' మనవరాలి ప్రశ్నకు ఏ తాత జవాబు చెప్పగలడు? "ప్రకృతి ఊదిన ఊపిరికి పుట్టిన మొగ్గలు పిల్లలు" ఒదిగిన తాత ఎదిగిన మన వరాలు' (పే.61) లిపి లేని భాషలో (మనవరాలికి) మురిపించటం తెలుసు (పే.62) మాటల బెత్తం చేబూని మనల్ని ఆశ్చర్యంలో మునక లేయిస్తారు. భావి జాతి నిర్మాతలు కదా పిల్లలు (పే.65) లాంటి వాక్యాలు బావున్నాయి. సంకలనంలో గొప్ప కథ అనిపిస్తుంది ఇది.

ఇలాంటి సంకలనాలు వెలువరించటానికి సంపాదకులు **"అవిధారా వ్రతం"** చేయాల్సి వస్తుందనుకుంటాను. ముఖ్యంగా క్రొత్త రచయితల కథలను ఎన్నుకోవటంలో సంపాదకులు మరికొంత నిఖ్ఖచ్చితనం, పాటిస్తే మరింత బావుండేది. ప్రచురించిన కొన్ని కథలు పేలవంగా ఉన్నాయి. ఒక్కోచోట కథకిచ్చిన శీర్షికకు కథకు ఏమి 'పొంతన' ఉందో చదువరికి అర్థం కాదు. ఒక కథలో శృంగారం మితి మీరినట్లనిపించుతుంది. రాధికా స్వాంతనం (ముద్దు పళని) గొప్ప కావ్యమే! కాని అది లోగడ విమర్శకు లకు గురియై కొన్నాళ్ళపాటు నిషేధానికి గురియైందన్న విషయం మరువ కూడదు. రంగనాయకమ్మగారి **''డబ్బు''** మంగిపూడి రాధికగారి **"సంక్రాంతి"** సలీమ్‌గారి **"లాకులు"** పైన చెప్పిన **"అరిందా"** లాంటికథలు సంకలనం విలువ పెంచేవిగా ఉన్నాయి.

ఒకటి రెండుకథలు వ్రాసి తమకు తాము పబ్లిష్ చేసుకోలేని వారికి దినవార, మాసపత్రికల్లో వచ్చిన కథల్ని పుస్తక రూపంలో భద్రపర్చు కోదలిచిన వారికి సంపాదకులు ఎన్.కె. బాబుగారు ఒక మంచి అవకాశం కల్పిస్తున్నారు. అభినందనలు.

ప్రతులకు: ఎన్.కె. పబ్లికేషన్స్
24-8-1, సమీర రెసిడెన్సీ
విజయనగరం-535 002
సెల్: 94403 43479



– కూర చిదంబరం
సెల్: 8639338675

కన్నెర (కథ)

నేను తూర్పు నుండి ఈశాన్యా నికి విసిరి వేయబడ్డ దాన్ని మరి ఏదో చేయాలని పరితపిస్తూ వుంటాను. చదివింది కొద్దో గొప్పో చదువులు అని నా మదిలో నేను మధన పడుతూ ఉంటేను నా పెనిమిటి.

నువ్వెందుకు లోలోపలన క్రుంగిపోతావు చదువులు చదువుట నాకు గొప్పే కదా అంటూ ఆకాశములోకి తదేకంగా చూస్తున్నాను.

ఏదో ఆలోచనల్లో మునిగి తెలుతున్నాడు గురు. అంతలో యూనియన్ మీటింగ్ అంటూ కొందరు స్నేహితులు వచ్చి గురును ఇంటి నుండి తీసుకెళ్ళారు. అంతలో అమ్మ అంటూ లలిత గారాల పట్టి చిలక పచ్చ చీరను కట్టుకోని ముంగిట్లో ముగ్గురాయితో వచ్చి రాని ముగ్గు వేస్తూ కుస్తీ పడుతుంది లలిత నువ్వు నా అరాంగివి పై

కూతురు కోమలి. ఇంతలో ఓ లాలీపాప్ తీసుకొచ్చి కోమలి చేతిలో పెట్టి మురిసిపోయాడు అన్న రవి.

ఇంతలో లలితను పై చదువు కోసము బి.ఇ.డి కాలేజీలో చేర్చాడు గురు. కొత్త లోకము వింత పోకడ అనే రీతిలో ప్రవర్తనలో మార్పు వచ్చింది. నాకు స్వేచ్ఛ ఉంది అంటూ కుటుంబముకు బాధ్యతలుకు నిందుగా నీళ్లు వొదిలేసింది లలిత. ఇంకేముంది గురు పిల్లలున్నారనే విచక్షణ మరిచి భార్యభర్తల బంధంకు పూర్తిగా వీడ్కోలు ఇవ్వాలనే ఆలోచనలు గుండె లోతుల్లో నిందుగా ఊగిసలాడుతున్నాయి.

తన వద్ద విద్య నేర్చుకున్న ఓ ముస్లీము మహిలతో లోతుగా ప్రేమ మైకములో మునిగిపోయాడు గురు. ఇల్లాలి నిర్లక్ష్యం ఓ కుటుంబాన్ని నిందుగా అగాదములోకి పడవేసింది. ఓ గూడు కింద కలసి బ్రతకవాల్సిన నలుగురి జీవితాలు గాలిలో దీపమై నిలిచాయి. భార్యభర్తల నడుమ ఓ పెద్ద పెనుతుఫాను ఉప్పెనలా ఉప్పొంగింది. భావ ఆవేశముల నడుమ మనసులోని ప్రేమలు సమాధి ఐపోయాయి. ఎండమావి బ్రతుకుల్లో ప్రేమ వసంతం కనుమరుగు ఐపోయింది.

శత్రువుల్లా ఒక్కరిపై ఒక్కరు కత్తులు దూసుకుంటూ ఉంటే సంసారం యుద్ధభూమిని తలపించేటి ప్రకంపనలు చూసి పసిడి గుండెల్లో నిరాశ వెల్లువల్లా ఉప్పొంగింది. లలిత గుండెల్లో చెలరేగిన కోపాగ్నితో గురుని శత్రువుల్లా భావించింది లలిత. కట్టుకున్న మొగుడే నాకు కాలయముడు అయ్యాడే అని బోరున విలపించింది. నాకెవ్వరున్నారని ఆకాశములో ఎర్రగా భగ్గుమంటున్నసూర్యన్ని చూస్తూ తన చెంపలపై కారుతున్న కన్నీటిని అలా మునివేళ్లతో తుడుచుకుంటూ క్రుంగి పోసాగింది లలిత. వీధుల్లో నుండి పరిగెత్తుకుంటూ వచ్చి గట్టిగా అమ్మను కౌగిలించుకొని అమ్మ ముఖాన్ని పదే పదే తదేకముగా చూస్తుంది కోమలి. అమ్మ మనసు చాటున దాగిన భాద ఏమిటో అర్థం చేసుకునే వయస్సు కాదు మరి.

భర్త చేస్తున్న యవ్వారమును చాటుగా కన్నేసి కసిగా కన్నెర్రజేసి తన పుట్టింటి వారితో కలిసి పోలీస్ స్టేషన్‌కి బయలుదేరింది. భార్య ఉండగానే మరో మహిళతో అక్రమంగా పెట్టుకున్న కనెక్షన్లు పోలీస్‌ల ముందు ఇంటి గుట్టును బట్టబయలు చేసింది. గురుది గవర్నమెంట్ ఉద్యోగము కావడముతో మెడకు ఉరితాడు బిగుసుకున్నది. యఫ్.ఐ.ఆర్ నమోదు చేసి జైలు నాలుగు గోడలు మధ్యన కూర్చోపెట్టారు. ఈ వార్త ఈ నోటా ఆ నోటా పడి ఊరు వాడ అంత చక్కర్లు కొట్టింది. కొన్ని నెలలు జీతము రావడము ఆగిపోయింది. సొంత వాళ్లే చూసి నవ్విపోయారు. జైలు గోడల నడుమ జీవితము అంటే ఏమిటో తెలిసి వచ్చింది. కుట్టుకున్న భార్య కన్నెర్రజేసి బ్రతుకును నవ్వులు పాలు చేసిందని ఆడదంటే అలుసుగా చూడటము తప్పు అని కనువిప్పు కలిగింది. తప్పు ఎవ్వరిదయినా గురు జీవితంకుకుటుంబానికి అండగా వున్న ఉద్యమం కాస్త పోయి బతుకు భారమైంది. నాన్నని జైల్లో పెట్టింది అమ్మే అంటూ బిక్కుబిక్కుమని ఏడ్చారు పిల్లలు. పంతాలు పట్టింపులకు పోయి వున్న గూడును వదిలి లలిత ఒంటరిగా కూలి చేయాలిసిన స్థితిలోకి చేరింది. కాళ్ళని తిట్టే నోటిని ఎవ్వరూ ఆపలేరు సుమీ గురు ప్రవర్తనలో మార్పు రాలేదు సుమీ కోర్టు సాక్షిగా వున్న ఇద్దరు బిడ్డలను ఒక్కొక్కరిని పంచుకున్నారు. మూడు ముళ్ల బందాన్ని న్యాయ దేవత ముందు తెంచుకోని భార్యగా తనకు రావాలిసిన వాటాను కూతురు పోషణ నిమిత్తం అర్థ జీతమును ఇవ్వమని కోర్టు ఆదేశించింది. పగిలిన మనసులుతో బందాన్ని తెంచుకోని ఎవ్వరిదారుల్లో వారు శారీరక సుఖము కోసము పిల్లల భవితను నిలువునా శాపము చేశారని సమాజంలో చెరగని ముద్రను వేసుకోవడము తప్ప ఇంకేమి సాధించారు.కొన్ని లక్షలు ఖర్చుచేసుకోని పోయిన ఉద్యోగములో మరలా చేరాడు గురు కానీ ఇటు ఇల్లాలు పోయి రెండింటికి చెడ్డ రేవడిలా మారింది గురు జీవితము. ప్రభుత్వ ఉద్యోగి నైతిక విలువలు కలిగి ఉండాలని గురు నేర్చుకున్నాడు.

-ధనాశి ఉషారాణి
9441803495

రంగనాయకమ్మ కథ 'విధవల పట్ల...'

ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు రంగనాయకమ్మగారు రాసిన "విధవల పట్ల..." కథపై అనిశెట్టి రజిత విశ్లేషణ..

తెలుగు సాహితీ లోకంలో రంగనాయకమ్మగారిది ప్రత్యేక స్థాయి, స్థానం. వీరు 1939లో పశ్చిమగోదావరి జిల్లాలో జన్మించారు. స్వీట్‌హోమ్, స్త్రీ, పేకమేడలు, అమ్మ, జానకి విముక్తి, అమ్మకు ఆదివారం లేదా? బలిపీఠం, కళ్ళు తెరిచిన సీత నవలలూ, కథా సంపుటాలు; చలం సాహిత్యం, రామాయణ విష వృక్షం, తెలుగు వాచకాలూ, అనువాదాలూ, పరిచయాలూ, వ్యాకరణాలూ, తత్వశాస్త్రం, మార్క్స్ కాపిటల్ ఇవిగాక మరెన్నో రచనలు చేసారు.మార్క్సిస్ట్ రచయిత్రిగా రాజకీయ, ఆర్థిక, సాంఘిక సామాజికాంశాలపై పలు రచనలు చేస్తున్నారు.

రంగనాయకమ్మ 'అమ్మ' కథా సంపుటి 1966 లో మొదటి ముద్రణ పొందింది. ఈ పొత్తంలో 9 కథలున్నాయి. అన్నీ కూడా 1950ల చివర్లో 1960ల్లో రాసినవే. 'విధవల పట్ల మన కనీసధర్మం !' కథ 1958 మార్చి నెలలో "ప్రజామత" పత్రికలో ప్రచురింపబడింది. ఈ కథ సుమారు 65 ఏళ్ల నాటి మన సమాజానికి చెందినది. ఇద్దరు స్నేహితురాళ్ల మధ్య ఉత్తరాల రూపంలో కథ నడుస్తుంది. కుసుమ ఉత్తరం అందుకుంటుంది అనురాధ. ఆ లేఖలో కుసుమ 'విధవరాలు' అనబడే విద్యార్థిని తమ కళాశాలకు మల్లు చీర కట్టుకొని, వెంట్రుకలు ముడేసుకొని వస్తుంటే సాటి పిల్లలు ఆమె పట్ల హేళనగా ప్రవర్తించడం గురించి రాస్తుంది. ప్రత్యుత్తరం రాస్తూ తన ఊళ్లోనే కాదు ప్రతిచోటా వైధవ్యం పొందిన స్త్రీల పట్ల సాటి స్త్రీలూ సమాజం వ్యవహరించే తీరు గురించి తన అనుభవంలోని సంఘటనలు కొన్ని స్నేహితురాలితో పంచుకుంటుంది అనురాధ. ఏయే సందర్భాలలో భర్తపోయిన ఆడవాళ్ళను ఎలా చూస్తారు, వెలివేస్తూ అవమానాలపాలు చేస్తారో కొన్ని అనుభవాలను రాస్తుంది. తమ ఇంట్లో జరిగిన ఒక పేరాంటానికి పిలుపులకని చిన్న కుంకుమ భరిణే తీసుకుని వెళ్తుంది అనురాధ. ఒక ఇంట్లో ఇరవై ఏళ్లు కూడా లేని వితంతువైన అమ్మాయిని ఆమెను పేరంటానికి పిలవరని తెలిసినా పిలుస్తుంది. ఆమె రాను రాలేను అంటుంది. అందర్నీ పిలిచినట్లు నిన్ను పిలుస్తున్నాను అంటే నీకభ్యంతరం లేకపోయినా మీ అమ్మా, నాయినమ్మ, మీవాళ్ళకుంటుంది, వచ్చిన పేరంటాళ్లందరూ నన్ను నవ్వులపాలు చేస్తారు ముక్కున వేలేసుకుంటారు నేను రాను, నాకా అర్హతలేదని విచారంగా చెప్తుంది. రచయిత్రి మళ్ళీ రమ్మని వాదిస్తుంది. అప్పుడా అమ్మాయి మా చెల్లెలి పెళ్ళిలో ఏం జరిగిందో నీకు తెలిసికూడా నన్ను పేరంటానికి రమ్మని ఎలా అడుగుతున్నావని దీనంగా ప్రశ్నిస్తుంది.

నిజమే ఆ రోజు జరిగిన తతంగం కొద్దిగ కాదు. ఆ అమ్మాయితో పాటు భోజనాల బంతిలో కూర్చున్న స్త్రీలు రకరకాల సాకులు చెప్తూ మళ్ళీ కూర్చుంటామని లేచి వెళ్ళిపోవడం. ఇలాంటి వాళ్ళతో కలిసి భోజనం చేస్తే అశుభమని గుసగుసలుగా అనుకోవడం, కళ్ళు పెద్దగా చేసుకొని ఆమెను వింతగా చూడటం, బిత్తరపోయి ఉన్న ఆ అమ్మాయిని వాళ్ళ అమ్మమ్మ వచ్చి "పునిస్త్రీ వాళ్ళతో నువ్వెందుకే ? దిష్టి పిడతలా, పద లోపలికి" అని లాక్కుపోవడం.. ఆ అమ్మాయి అవమానంతో తలెత్తుకోలేకపోవడం గుర్తుచేసుకుంటుంది అనురాధ.

నిత్య జీవితంలో పొద్దున లేచినప్పటి నుండి వైధవ్యం పొందిన స్త్రీల ముఖాలు చూడటం అపశకునం, అశుభం అంటూ ఈసడించడం. అది సబ్బుతోగాని సాన్నం చేయడట అని వారు పరిశుభ్రంగా ఉండటం కూడా చూడలేని వాళ్ళు, వాళ్ళ ఆహారపు అలవాట్లపై ఆంక్షలు విధించి తమలోని వికృతాన్ని చల్లార్చుకునేవాళ్ళు, అంతటా వాళ్ళ ఉనికిని తిరస్కరిస్తూ తమ నుండి దూరం పెట్టడంలాంటి మూర్ఖతాలను గురించి బాధగా కుసుమకు రాస్తుంది అనురాధ. భర్తపోయిన ఆ స్త్రీలపట్లా వారి కొచ్చిన కష్టాలపట్లా, జీవచ్ఛవాల్లా వాళ్ళను బ్రతకమని శాసించడం పట్లా వ్యతిరేకతతో మనం సానుభూతిగా ఉండాలని తన ఆలోచనలు వెళ్ళబోసుకుంటుంది. సానుభూతిగా ఉండటం అంటే జాలి పడటమా ? కాదు వాళ్ళు వేరు అని కాకుండా తమలాంటి స్త్రీలు అని మామూలుగానే సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండటం.

×××

> "అరవై ఏళ్ళ నాటి సమాజంలో స్త్రీ అస్తిత్వం భర్త అస్తిత్వంతో మాత్రమే ముడివేసి చూసే సమాజంలోని అనాచారాలూ అవమానకర సంప్రదాయాలపట్ల రచయిత్రి వేదనతో, నిరసనతో రాసిన కథ"

అరవై ఏళ్ళ నాటి సమాజంలో స్త్రీ అస్తిత్వం భర్త అస్తిత్వంతో మాత్రమే ముడివేసి చూసే సమాజంలోని అనాచారాలూ అవమానకర సంప్రదాయాలపట్ల రచయిత్రి వేదనతో, నిరసనతో రాసిన కథ "విధవల పట్ల మన కనీస ధర్మం" !

సమాజంలో జీవన క్రమపద్ధతి, క్రమశిక్షణాయుత జీవితం కోసం మనం ఏర్పర్చుకున్న కొన్ని నియమాలూ, విలువలూ, సంప్రదాయాలూ, ఆచారాలూ, వావి వరుసలూ, సంస్కృతీ కొందరికి సౌఖ్యాన్నీ, అధికారాన్నీ ఇస్తే మరికొందరిని అత్యంత హీనమైన దీనమైన స్థితిగతుల్లోకి తోసేస్తుంది.

పురుషస్వామ్యం పెత్తనం చెలాయిస్తూ అడుగడుగునా అధికార శాసనాలు జారీ చేస్తూ అజ్ఞానాం ధకారంలోకి సమాజాన్ని నెట్టివేయ డం అనాదిగా జరుగుతున్న అకృ త్యం. పెత్తనం ఒక విచక్షణా రహితమైన మత్తు. అది కఠినంగా నిర్దాక్షిణ్యంగా చెలాయింపబ డుతుంది. స్త్రీల మీద వేతలూ, స్త్రీల పట్ల ఏర్పర్చుకున్న దృష్టికోణాలూ అన్నీ కలిసి అశుభం, అపశకునం, ఆచారం, సంప్రదాయం అన్న ఉరితాళ్ళను వైధవ్యం పొందిన స్త్రీ పట్ల నిర్దాక్షిణ్యంగా బిగిస్తుంది. వైధవ్యం అనే ప్రయోగం ప్రత్యేకత ఏమిటి ? స్త్రీని రాతి బొమ్మలా చేయడం ఎందుకు ? ప్రగతి ప్రగల్భాలు వల్లించడం ఎందుకు ?

సమాజంలో చెలామణిలో ఉన్న ఆంక్షలు, పాటింపులు స్త్రీలపట్ల క్రూరమైన పాశాలుగా మారుతాయి. ఈ అశాస్త్రీయ నమ్మకాలతో, మూఢత్వంలో కరుడుగట్టిన విశ్వాసాలతో అభాగ్యతను స్త్రీలనుదుట బలవంతంగా రుద్దబడుతున్నది. సమాజం సిగ్గుపడుతూ తలదించుకొని సంస్కరణ ప్రక్షాళనా చేసుకోవాల్సిన విషయా

ఎంపిక !

మదిలో అలసటలేని ఆలోచనలతో
ప్రతినిత్యం స్పష్టమైన ఆత్మపరిశీలనతో
అభివృద్ధి బీజాలు నాటిన వారితో కలిసి
నిరంతరం తపన అనే ఎరువును వేస్తూ
నిజజీవితంలో ఉన్నతంగా ఎదగడానికి
వాస్తవాల వ్యవసాయానికి నైతిక శక్తిని
సమకూర్చేది మనమెంచుకున్న 'ఎంపిక ' !

సుధీర్ఘమైన జీవితయాత్రలో ఎంపికనేది
సుడిగుండాలతో ఎదురయ్యే ఒత్తిడులకు
అశాంతికి గురయ్యే అర్థంకాని చిక్కులకు ,
మానసిక ,శారీరక, ఆర్థిక క్రమశిక్షణ నేర్పిస్తూ
మనిషిని నిలబెట్టే ఆక్సిజన్ పరికరంలా....
ఎన్నో భావోద్వేగస్థితులకు ఏకైక సమాధానం!

విచక్షణతో ఎంచుకొని ఎదిగిన ఎంపిక ,
వివేకంతో అనుసంధానమైన ఎంపిక ,
అస్థిత్వాన్ని సుస్థిరంగా నిలిపే ఎంపిక,
ఓపికను ఆభరణంగా మలచుకొన్న ఎంపిక
అన్నికాలాల్లో విశ్వాసంతో విజయాన్నిస్తుంది!
రాచబాటలో లోకంముందు నిలబెడుతుంది!

ఏదేమైనా ...
అనుకున్నంత పరిణతి చెందలేక
అవగాహన రాహిత్యంతో , స్వార్థాలు
అపార్థాలు ఆవహించిన ఎంపికలో ...
సానుభూతిని ఆశించే పరిచయాలు
అవసరాల మూసలో ఇమిడే స్నేహాలు
చెప్పిందివింటూ తలూపే సహచరులు
ఆధారపడడం అలవాటైన అనుచరులు
పరిస్థితులను అర్థంచేసుకోని బంధాలు
గుణానికి విలువనివ్వని అనుబంధాలు
ఆలోచన సామర్థ్యం పెంచని చదువులు
నమ్మకంలేని దైవం , నటన నేర్చిన ప్రేమలు
ఎప్పటికైనా మన పాలిట ముళ్ళకంచెలే !
ఎన్నటికైనా మనకు చిరిగిన పాదరక్షలే !

జీవితంలో సరైనదికాని ఎంపిక ఏదైనా ...
ఆనందానికి పట్టిన అల్పరనే అనుకోవాలి !
సంతోషానికి సోకిన క్యాన్సరని గుర్తించాలి !
ఎంచుకున్న ఎంపిక ఎగుడు దిగుడై
యెదనెప్పుడు కలవర పెడుతున్నప్పుడు
తుంచుకోవడమే మనసుకు పరమసౌఖ్యం !

జననమరణాలు మనచేతుల్లో లేకున్నా ,
ఆలోచనలకుతగ్గ ఆణిముత్యాల ఎంపికనేది ...
ఎన్నో మంచిచెడుల చరిత్రకు పునాదిరాయి !
విమర్శలకు విలువైన జవాబునిచ్చే వికీపీడియా!
గుప్పెడంత గుండెకు గుర్తింపుని తెచ్చే గూగుల్ !

అందుకే ...
జీవిత గ్రంథంలో పాతాళాన్ని , ఎవరెస్టును
సమంగా నిర్వచించిన అధ్యాయమే ఎంపిక !
ఎంపికనే ఎవరి ఎదుగుదలకైనా తొలిమెట్టు !
వికాసానికి ఆటపట్టు ! విచక్షణకు తేనెపట్టు !
విశ్వాసానికి శక్తినందించే ఆయువుపట్టు !
విధిరాతను మార్చే విలక్షణమైన పనిముట్టు !

– డా. డి. రాజేశ్
9440460490

నీదే గెలుపు

ఆలోచనలు ఆకాశాన్ని
అంటుతున్నాయి
అడుగులు
గడప దాటకున్నాయి..

ఆశ ముడుచుకొని పడుకుంది
నిరాశ నిద్రలేచి తిరుగుతుంది
స్పష్టత తెలియని ఆశయం
దిక్కులు చూస్తోంది
ఇలాగైతే గమ్యం చేరలేవు..

సింహంలా జూలు దులుపు
మనసును నిద్రలేపు
అడుగులు తడబడకుండా
వేయి అడుగులు ముందుకు
గమ్యం చేరే వరకు
వేయకు అడుగులు వెనకకు..

ధైర్యంతో చేతులు కలుపు
పిరికితనం పీక పిసుకు
ఇక నీదే గెలుపు

– బూర దేవానందం
8143589789

తెలివి (కథ)

నరేష్ ఆరవ తరగతి చదువుతున్నాడు. తెలివైనవాడు. చదువులో,ఆటపాటల్లో నరేష్ దే ప్రథమస్థానం. విద్యార్థుల నాయకుడుకూడా.

ఒకరోజు రోజా,సంగీత వాదించుకుంటూ నరేష్ కంటపడ్డారు. "ఎందుకు వాదులాడు కుంటున్నారు?"అనిఅడిగాడు.

."నా పెన్సిలు బడిలో ఎక్కడో పడిపోయింది.అది సంగీత వద్ద ఉంది.ఇవ్వమని అడిగితే ఆ పెన్సిలు తనదని ఇవ్వనంటోంది"చెప్పింది రోజా.

"సంగీత వద్ద ఉన్న పెన్సిలు నీది అంటున్నావు.నీ పెన్సిల్లా కనిపించినంత మాత్రాన నీదని చెప్పలేము కదా! ఏదయినా గుర్తు చెప్పు" అన్నాడు నరేష్.

"నా పెన్సిలును గుర్తు కోసమని కింది భాగంలో కొరికి ఉంచుకున్నాను" చెప్పింది రోజా.

రాజేష్ పెన్సిలును సంగీత చేతిలో నుండి తీసుకుని చూశాడు.పెన్సిలు చివరన కొరికిన గుర్తు ఉంది.

"సంగీతా!ఈ పెన్సిలు రోజాదే. నీది కాదు. నీ పెన్సిలు ఎక్కడో పడిపోయి ఉంటుంది. వెదుక్కోకనిపించకుంటే నా దగ్గరున్న రెండు పెన్సిల్లలో ఒకటి నీకు ఇస్తానులే" అని చెప్పి పెన్సిల్ ను రోజాకిచ్చాడు.

సమస్య సులభంగా పరిష్కారమవడం తో అందరూ సంతోషించారు.

–పి.రమాదేవి.
గొరిగనూరు.6వ తరగతి
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల.
జమ్మలమడుగుమండలం.కడపజిల్లా

"నమ్మకం"

గోదావరి నదికి సుమారుగా ఓ కిలోమీటరు దూరంలో తుంగెన అనే గ్రామంలో వీర స్వామి అనే భక్తుడు ఉండేవాడు. ఆ స్వామి శివభక్తుడు. యెల్లవేళలా శివ నామస్మరణమే. ఏ పని చేసినా భగవంతుని మీద నమ్మకం ఉంచే చేసేవాడు.

ఇలా ఉండగా ఒక రోజు అత్యవసర పని ఉండటం వలన నదికి ఆవలి గట్టున ఉన్న సూరెళ్ళి గ్రామానికి వెళ్లాల్సి వచ్చింది. అప్పటికీ సాయంత్రం అయ్యింది. తొందరగా వెళ్లి తిరిగి వద్దామని నిర్ణయించుకొని, మనసులో భగవంతుణ్ణి తలచుకొని బయలుదేరాడు.నది నిండుగా పారుతోంది. "నీళ్ళ ద్వారానైతే దాటి పోలేను" అనుకొని కొంత దూరంలో తాళ్ళతో అల్లిన జూలా (తాళ్ళతో తయారు చేసిన వంతెన)పై నడక ప్రారంభించాడు. ఒక వంద గజాల దూరం వరకు నడిచాడు. అంతవరకు ఆ వంతెన బాగానే ఉంది. నది మధ్యలోకి రాగానే వంతెన వదులుగా అయిపోతోంది. అలా వదులు అయి పోగానే తనకు అనుమాన మొస్తోంది. ఈ వంతెన తాడు తెగి నట్టుందని. వెంటనే తన ఇష్ట దైవాన్ని స్మరించుకొన్నాడు. "దేవుడా! శివా! ఈ ఆపదనుండి నన్ను గట్టెక్కించూ" అని.

తాను అలా తలచుకున్నాడో లేదో భోళా శంకరుడు "వీర స్వామీ! ఇదిగో నేను వచ్చేశా. నీవు త్వరగా వచ్చేసేయి" అని అవతలి గట్టు నుండి పిలిచాడు.

ఆ పిలుపుతో ఎంతో సంబరపడిపోతూ ముందుకు అడుగులు వేస్తున్నంతలో ఆ తాళ్ళ వంతెన మరింతగా పదులై నీటిని తాకేటట్టు అయిపోతోంది. వంతెన తాడు తెగిపోయిందని వాపోతూ "అయ్యా! శంకరా! నేను నీటిలో పడిపోతాను. పిలవగానే వచ్చావుగానీ, నన్ను మాత్రం రక్షించడం లేదు. ఏం చక్కా నిలబడి తమాషా చేస్తున్నావు, నీవెం దేవుడివయ్యా! అసలు నిన్ను నమ్మి రావడం నాదే తప్పు.." ఇలా అనేక రకాలుఆ అటు దేవుణ్ణి ఇటు తనను తాను నిందించుకుంటు అడుగులో అడుగు వేసుకుంటూ ప్రాణం అరచేతిలో పెట్టుకొని చేతలుడిగి నిలబడిపోయాడు.

అవతలి గట్టునున్న శివుడు పిలుస్తూనే ఉన్నాడు. "భక్తా! నీకేం భయం లేదు నేనున్నాను. ఒక్కొక్క అడుగేస్తూ ముందు కొచ్చేసేయి" అని.

ఆ మాటలకు మరింత కోపంతో కూడిన విసుగుతో "నువ్వు భలేచెప్తావు ఇదిగో చూడు, తాడు మొత్తం నీళ్లకు ఆనుతోంది. మరో నిమిషంలో నేను నదిలో మునిగిపోవడం ఖాయం.."

అతని మాటలకు పగలబడి నవ్వుతున్నాడు దేవుడు.

రెచ్చిపోయిన కోపంతో ప్రాణానికి తెగించి, పెద్ద పెద్ద అడుగులు వేగంగా వేస్తూ అవతలి గట్టుసపడ్డాడు వీరస్వామి. తనకు ఎదురుగా చేతులు కట్టుకొని మందహాసంతో నిలబడ్డ శివుణ్ణి చూసి కోపోద్రిక్తుడై ఏదో అనబోతున్న వాడాల్లా శివుడు తన బొటన వ్రేలుకు ఆ వంతెన తాడు కట్టుకొని ఉన్న దృశ్యం చూసి అవాక్కయి, "స్వామీ! శంకరా! నన్ను మన్నించు స్వామీ!" అంటూ స్వామీ పాదాలపై పడి "ఈ మందమతిని క్షమించు తండ్రీ! నీ లీల అమోఘం..ఇలా పలువిధాలుగా వేడుకుంటున్నాడు.

అతని ఆవేదనను గ్రహించి అతని భుజాలను పట్టి లేపుతూ "భక్తా నన్ను నమ్మిన వారికి ఈ స్వామి ఎప్పుడూ వెన్నంటేవుంటాడు. కానీ మీరేమీ ప్రయత్నం చేయకుండా అంతా నా మీదే భారమంటే మాత్రం నేను ఏమీ చేయలేను సుమా! అందుకే నిన్ను ముందుకు అడుగు వేయమని చెప్పాను. విసుకుంటూనో కోపంతోనో అడుగులైతే ముందుకేశావు. అందుకే నీవు ఆపద నుండి గట్టున పడ్డావు. ఎప్పుడైనా గుర్తించుకో ప్రయత్నం చేయకుండా, పని మీద నమ్మకం లేకుండా చేసే వాటికి నేనెప్పుడూ సహకరించను గాక సహకరించను" అని చెప్పి అదృశ్యమయ్యాడు భగవంతుడు.

–దారం గంగాధర్
సెల్:9848384777

రక్షక భటులు

అస్తమించని సూర్యుడిలా
ఏ రస్తాలోనైనా..ఏ చౌరస్తాలోనైనా
నిలబడే ఉంటాడు...
ఎన్ని నిశిరాత్రులు చుట్టేసినా
ఎన్ని విషపు దారులు అడ్డగించినా
నిత్యం ఓసాయుధ పోరాటమే!!...

ప్రజల శాంతికొరకు..
వారి సంరక్షణ కొరకు..
అవినీతిని అన్యాయాన్ని తుదముట్టించి...
సమాజాన్ని పీడిస్తున్న
చీడపురుగుల్ని ఏరిపారేసి...
ఓ చైతన్యపు కంచెగా నిలబడేది
ఈ రక్షక భటుడు!!

ఏ సమస్య వచ్చినా
తలదించక నిలబడతాడు...
ఎన్ని మృత్యుఘంటికలు ముసిరినా...
తన పిడికెడు గుండెకు ధైర్యం చెప్పి
వేలకోట్ల పిడికిళ్ళ గుండెల శబ్దాలు
వినే ప్రయత్నం చేస్తుంటాడు..

ధైర్యాన్ని ఇస్తుంటాయడు!!...
సందర్భాన్ని బట్టి భయం పోగొడతాడు..
అప్పుడప్పుడు
శాంతియుత సమరం చేస్తుంటాడు..
అతని సమరం అనునిత్యం!!...
అతని చరిత్ర సదా అమరం!!...

అతడు సమాజానికే నిజమైన నేస్తం..
నమ్మకానికి...నిత్యవారధి!!...
ఈ దేశానికి అసలైన వారసుడు!!...
అలుపెరుగని రక్షకభటుడు...

నిత్యం ఏదో రహస్య సంకేతాల్ని
అందుకుంటూ...దూరాలను
దాటుకుంటూ ఆఘమేఘాలమీద
అడుగులు వేస్తాడు...
నిత్యం రక్షణకై చైతన్యజ్వాలగా
ఆత్మస్థైర్యంతో అడుగులు వేస్తాడు...

క్షణ క్షణం ప్రతిక్షణం ఓ సవాల్!!
అబద్ధాన్ని తుదముట్టించి
నిజాన్ని రాబట్టి...
ప్రతి మనిషినీ మారేలా చూస్తాడు...
అంతర్గత కలతల్ని దూరంచేస్తాడు...

నిరంతర కర్తవ్యంలో
ఎగిసిపడే ఎదురొచ్చే
ఆపద అలలు ఎన్నెన్నో!!
కరుడు కట్టిన కాలంలో
కమ్ముకొచ్చే ఆపదలెన్నో!!
తెలియని ఏ చీకటి శాసనాలు
చిదిమేస్తాయో..
ఏ మృత్యుక్షణాలు ముంచుకొస్తాయో!!

అప్పుడప్పుడు తప్పులు
ఉప్పెనలా తలెత్తవచ్చు..
వీరి కష్టాన్ని చూసి విసిగిపోయి
నిశిరాత్రి కసురుకుంటుంది...
అప్పుడే గుండె ఆగిపోతుంది..
ఎందరెందరో రక్షక భటులు
అమరులై ప్రజల గుండెల్లో
శాశ్వతంగా మిగిలిపోతారు!!...

–అంబటి నారాయణ
9849326801

గర్జించిన స్త్రీ

సామూహిక అత్యాచారాలు చేసిన , వారి పై ఆడ సింహా మై గర్జించి కదన రంగంలో కత్తులు దూసిన ఝాన్సీ రాణి వలె శత్రువులను చీల్చి చెండా డాలి !

పరిమళించిన మానవత్వంతో రోగులను అక్కున చేర్చుకొని జీవం పోసిన మానవతా మూర్తి మదర్ థెరిస్సా వోలె దేశమంతా ప్రేమ పొంగి పొరలే లా వనితలు నడుం బిగించి తల్లి సేవలు చేయాలి.

స్వాతంత్ర్యం కొరకు తెగించి కొట్లాడిన కవయిత్రి గాన కోకిల సరోజినీ నాయుడు వోలె దేశ భక్తి యే శ్వాస కావాలి , కలాలు ఎక్కుపెట్టి సమాజములో మగువలు కుళ్ళును ఉతికి ఆరెయ్యాలి.

మహిళా లోకానికి వన్నె తెచ్చిన క్రికెట్ క్రీడాకారిణి మిథాలీ రాజా లు కావాలి ముద్దు గుమ్మ లే బ్యాట్

పట్టాలి రేప్ చేసి ,సజీవ దహనం చేసిన మానవ మృగాల ముఖాలపై బంతిని రాకెట్ స్పీడ్ లో సిక్సర్ కొట్టాలి

లైంగిక వేధింపులు చిరునామా లేకుండా తరిమి కొట్టాలి

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ మేరీకోమ్ లు గా రాటు తేలాలి ఆమె బరిలోకి దిగి వరకట్నం కొరకు వేధించే వారి ముఖాలపై దిమ్మ తిరిగే బలమైన పంచులు విసురాలి.

ప్రసిద్ది చెందిన పద్మభూషణ్ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా గా అవతారమెత్తి బాల్య వివాహం చేసిన వారి ని బంతిని కొట్టినట్లు కొట్టి బూజు పట్టిన ఆచారాలకు సంప్రదాయాలను కాల్చి బూడిద చేయాలి.అంతర్జాతీయ గుర్తింపు పొందిన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పద్మశ్రీ గ్రహీత పి.వి సింధుగా మారాలి ..చేత బడుల పేర ఆమె ను చెట్టుకు కట్టేసి చావు దెబ్బలు కొట్టిన క్రూర మృగాల ను షటిల్ ఆడాలి. మూఢ నమ్మకాలని కూకటి వేళ్లతో పెకిలించి గిరాటేయ్యాలి.ఆమె పై జరిగే అకృత్యాలకు అన్యాయాలకు ఎదురొడ్డి పోరాడాలిన చాకలి ఐలమ్మ ను స్ఫూర్తిగా తీసుకోవాలి.

ఆడ జన్మ సార్థకం చేసుకోవాలి .
సంపూర్ణ జీవితం గడుపాలి.

–పూసాల సత్యనారాయణ
9000792400

"ఉషస్సు" (కథ)

అరుణ నవ్వే సరికి నాకు ప్రాణం లేచొచ్చింది. ఎంత బాగా నవ్వింది ! గుండె నిండా కలిగిన తన ఆనందం కళ్ళగుండా కురిసే సరికి నాకు కడుపు నిండినట్టయింది. కొద్దిసేపు కూర్చుని మాట్లాడేసరికి కాస్త ప్రాణం కూడా చల్లబడింది.

నెల ముందు ఆసుపత్రిలో దిక్కు తోచక అయోమయంలో కనిపించింది. బెడ్ మీద పడి ఉన్న తన తండ్రికి వైద్యం కోసం ఆరాటం. అతడు పచ్చి తాగుబోతట. అరుణ తల్లి చనిపోతే ఇంకో పెళ్ళి చేయగా ఇతడిని భరించలేక ఆ రెండో ఆవిడ వదిలేసి వెళ్ళిపోయిందట. అయినవాళ్ళెవరూ అక్కున చేర్చుకోక తండ్రి బాధ్యత ఇక అరుణ మీదే పడిందట. ఏడెనిమిదేళ్ళకంటే ఎక్కువుండవు. ఏదో హోటల్ లో కప్పులు , గ్లాస్ లు కడుగుతుందట. అడిగితే అన్ని వివరాలూ చెప్పింది.

ఒకసారి చూద్దామనిపించి ఇవాళ మళ్ళీ స్కూలుకి పోయి కలుసుకున్నాను. నన్ను చూడగానే తన ముఖం వెలిగిపోయింది. నాకు కృతజ్ఞతలు చెప్పాలని ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తుంది కానీ , ఇంకా మొగ్గే కదా ! ఆ స్థాయి మాటలూ నేర్వలేదు. హావభావాలూ వంటపట్టలేదు. కానీ జీవితానికి సరిపడా క్షోభ ఇప్పటికే అనుభవించేసింది. మొత్తం మీద చిక్కగా నవ్వుతూ కాళ్ళకి మొక్కబో యింది. నేనే వద్దని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాను. ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది.

ఎంతో జాగ్రత్తగా ఆరోగ్యం గురించి అన్ని నియమాలూ , పాటిస్తాను. అయినా ఎందుకో అపుడు నాకు కాస్త ఎసిడిటీ శృతిమించి బాగా ఆయాసం వచ్చి , ఆసుపత్రిలో చేరటం జరిగింది. నేను నా బెడ్ మీద పడుకోవటం , పక్క బెడ్ ల వారితో మాట్లాడటం , పేపర్ చదుతుండటం , డాక్టర్స్ , నర్సులు చెప్పినవి మింగటం. ఇట్లా రెండు రోజులు గడిచింది. ఇంకో రెండు రోజులు ఉంచుకొని మందులు రాసి పంపిస్తామన్నారు. నాకు దగ్గరుండి అన్నీ చూసుకో బెడ్ లలో ఉన్నవారే పిల్ల ముఖం చూసి ప్రతీ పూట తమకు వీలైనంత పెడుతున్నారు.

అక్కడ మందులన్నీ ఉచితంగా ఆసుపత్రివారే ఇస్తారు కానీ , అప్పుడప్పుడూ కొన్ని ఇంజక్షన్స్ బయటికి రాస్తారు. ఆ సాయంత్రం వచ్చిన టెస్టుల తాలూకు రిపోర్టుల దృష్ట్యా అతగాడికి ఏవో లిస్ట్ బాగానే రాయడం జరిగింది. ఒక నర్సు అరుణ చేతిలో కాగితం పెట్టి "త్వరగా తీసుకురా" అని చెప్పి వెళ్ళిపోయింది.

ఈ పిల్లకేమీ అర్థమవటం లేదు. అయోమయంలో పడింది. చేతిలో రూపాయి లేదు. పాపం అనుకొని నేను మా మురళి గాడిని పంపించి ఆ సంగతి చూడమన్నాను. మా వాడు అందులో ఉన్నవన్నీ తెచ్చి సిస్టర్ ని పిలుచుకుని వచ్చి అప్పజెప్పడంతో పిల్ల అప్పుడు ఊపిరి పీల్చుకున్నది. నెత్తి మీది నుంచి పెద్ద మోపు దిగిపోయి నట్టుగా తేలికపడింది తన ముఖం. ఎంత ముద్దొచ్చిందో నాకు ఆ క్షణం. ఇంత చిన్న వయసులో తండ్రి ప్రాణాలని వీపు మీద వేసుకొని ఎంత శ్రద్ధగా మోస్తుంది కదా ! అంత నీచుడి కడుపున ఎంత గొప్ప అదృష్టం పుట్టిందో కదా ! అనూయగా అనిపించసాగింది నాకు వాడిని చూసే కొద్దీ.

అపుడే దగ్గరికి తీసుకుని వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాను. తన పేరు అరుణ అని , వాళ్ళని అక్కడ చేర్చిపోయిన వ్యక్తి తనకి మేనమామ అవుతాడని. ఎపుడో మాటలు తెగిపోయినా తను అడుక్కునందుకు వచ్చి ఆమాత్రం సాయం చేయడం జరిగిందని వరుసగా చెప్పింది. పాపం అతడు కూడా ఎపుడూ అంటూనే ఉంటాడట. "ఇంటికొచ్చి ఉండు నిన్ను కూడా బాగా చదివిస్తాను" అని. కానీ ఎక్కడో ఒక చోట తాగి పడిపోయే తండ్రి గురించి ఆలోచించి ఈ పాపే పోలేదట. వాళ్ళ వివరాలు అన్నీ తెలిసే కొద్దీ నాకు ఆ తండ్రి మీద మరింత అసహ్యం పెరిగిపోసాగింది.

ఆ తర్వాతి రోజే నాకు డిశ్చార్జ్ అన్నారు. అరుణ మా మురళి గాడి హడావిడి చూసి విషయం అర్థం చేసుకుని దిగులుగా తల దించుకుని కూర్చుంది పాపం. ఎవరో తెలియని నన్ను ఏమీ అడగలేదు. ఉండమని చెప్పనూ లేదు. తండ్రి వైద్యానికి ఇంకా ఏమేం కావాలో తనకి తెలియదు. తను ఉన్న స్థితి ఏమిటో కూడా తనకు స్పష్టంగా తెలియదు. కానీ , అన్నిటినీ ఎదుర్కోవాలి. తనను చూస్తూ నేను కూడా తీవ్రంగా ఆలోచనలో పడ్డాను.

ఆ మూడు రోజులలో తన ముఖంలో భయం , ఆందోళన , అయోమయం మాత్రమే చూడటం జరిగింది కానీ , ఏ క్షణంలో కూడా ఏడవలేదు. అడిగిన మిఠాయి ఇవ్వకపోతేనే గొంతు అరిగేలాగా ఏడ్చి సాధించుకోవాల్సిన పసి వయసులో , ఇంత దుస్థితి ఎదుర్కుంటూ కూడా ఏమాత్రం ఆ ఛాయలు వ్యక్తపరచకపోవటం నాకు మరింత ఆశ్చర్యంగా అనిపించింది. అంటే , ఇప్పటికే తన జీవితంలోని కన్నీళ్ళన్ని ఇంకిపోయి ఆ పచ్చి గుండె ఈ పాటికే బీటలు వారిందా ? అనిపించింది.

నేను బయలుదేరుతుండగా ఆ వార్డ్ వారందరూ ఆప్యాయంగా వీడ్కోలు పలుకుతున్నారు. నేరుగా చెప్పలేకపోయినా కూడా నాకు వాళ్ళందరి కళ్ళలోనూ అరుణ గురించిన అభ్యర్థనలు కనిపిస్తున్నాయ్. నేను తనకు దగ్గరగా పోయి నిలబడ్డాను. ఎవరికీ కనిపించకుండా కళ్ళు తుడుచుకుంటున్నది. అది చూసి నాకు గుండె ఒకరకమైన ఒత్తిడికి లోనయింది.

ఏడుపు ఉబికి వస్తున్నా దాచుకోవాల్సిన దారిద్ర్యం నాకు అరవై పైబడిన తర్వాత సోకింది. మొదటిసారి ఆ రకమైనటువంటి క్షోభ ని రుచిచూసినపుడు " ఇంకా ఎందుకు భగవంతుడా నన్ను బ్రతికే ఉంచుతున్నావు ?" అని లోలోపలే ఎంత తల్లడిల్లిపోయినానో నాకు మాత్రమే తెలుసు. ఆ తర్వాత క్రమంగా అలవాటైపోయింది. నేను మాత్రమే కాదు నా మిత్రులలో ఒకరిద్దరు తప్ప అందరి గతీ ఇదే. బంధాల మీద అమిత ప్రీతే ఇందుకు కారణం. కానీ , ఆరేళ్ళ వయసు దాటీ దాటని ఈ పిల్ల మీద దేవునికి ఇంత కర్కశమా ? ఎట్లా మోయగలుగుతుంది అంత బరువుని ! నాకేమీ అంతుబట్టలేదు.

అడుక్కోకుండా , పని చేసుకుని తండ్రి జీవితాన్ని ఒడిలో పెట్టుకొని కాచుకుంటున్న ఆ తుషార మేరువు కరిగి రెప్పల గుండా జాలువారుతుంటే చూడలేకపోయి నేనూ కళ్ళు తుడుచుకున్నాను.

వెంటనే నా మిత్రుడయిన రాఘవ వాళ్ళ మేనల్లుడు హరిని పిలిపించి విషయం మొత్తం వివరించి , పరిష్కారం చూపమన్నాను. అతడు ఎస్.ఐ. కాబట్టి అతడైతేనే ఇందుకు సరైన వ్యక్తి అనుకున్నాను. అనుకున్నట్టుగానే ఆయన నా మాటను మన్నించి వెంటనే బాధ్యత తీసుకున్నాడు. అరుణను ఒక నమ్మకమైన సంస్థకి అప్పగించి చదువుకు తగిన ఏర్పాట్లు అన్నీ తనే చూసుకున్నాడు. "తాగుడు మానేసి పనిచేసి సంపాదించి పాప పేరు మీద ప్రతీ నెలా బ్యాంకులో పొదుపు చేస్తూ ఎప్పటికపుడు రసీదులు నాకు చూపాలి. ఏ నెలలో రసీదు లేకపోయినా ఊరుకోను" అని ఆ తండ్రికి భయం కూడా చెప్పడం జరిగింది. హరి పోలీస్ కాబట్టి ఆ దుష్టుడు బాగానే భయపడ్డాడు.

అతనికి ట్రీట్మెంట్ అయిపోయేంత వరకూ ఉండి అన్నీ చూసుకోమని , తర్వాత మనింటికే తీసుకురమ్మని మురళికి అప్పజెప్పి నేను ఆరోజే ఇంటికి చేరుకున్నాను.

డిశ్చార్జ్ అయిన తర్వాత అతడు మురళితో పాటు వచ్చి కలుసుకున్నాడు. మా నర్సరీలోనే పనికిపెట్టుకున్నాను. అపుడపుడూ కూర్చోబెటుకొని అతనికి అర్థమయ్యేవిధంగా "ఇన్ని లక్షల ఆస్తి ఉన్నా నాకు తృప్తిలేదు. నా పిల్లలు పైస మోజులో విదేశాలకు వెళ్ళిపోయి నన్ను పట్టించుకోరు. కానీ , నీవు నాకంటే ఎన్నో రెట్ల అదృష్టవంతుడివి అరుణ వంటి కూతురుంది నీకు. ఎన్ని కోట్లు ఉన్నోడైనా నీ ముందు దిగదుడుపే. తనని మంచిగా చూసుకో , తన విలువ తెలుసుకో" అని చెప్తూనే ఉంటాను. కానీ వాడికి ఎంత చెప్పినా అర్థం కాదు. ఆ పిల్ల వల్లనే తాను ఇక్కడ బంధీగా పని చేయవలసిన కర్మ పట్టిందనే ఈసడింపుతో కనిపిస్తాడు.

సాధారణంగా మనిషి నైజమే ఇది. తనకున్న వాటి విలువను గ్రహించుకోలేడు. ఏదైతేనేం ? ఇపుడు అరుణ చదువుకుంటుంది. సంతోషంగా ఉంటుంది. తన తండ్రి మీద ఉన్న మమకారంలో పది పైసల వంతైనా నాకు పంచుతుందనే ఆశ నాకు కలిగింది.

తన పరిచయంతోనే జీవితం కాస్త సంతృప్తిగా మారింది. ఈరోజు లాగానే ఎదురుపడినపుడు నిండుగా నవ్వితే చాలు. అంతకుమించి సాటి మనిషి నుంచి పొందగలిగే విలువైనది ఇంకేం ఉంటుంది.

"అరుణ ముఖంలో ఆందోళన, భయం ఎగిసిపడుతున్నాయ్"

"సాధారణంగా మనిషి నైజమే ఇది. తనకున్న వాటి విలువను గ్రహించుకోలేడు"

–కుషినేర్ల నందు
9603234503

పక్షులు లేని చెట్లు....

ప్రపంచమంతా నేడు
ఒక వల లాంటి విష
వలయంలో చిక్కుకుని
తనని తాను బంధించుకుంది
గుండెల పై పుస్తకాలను
గిరాటేసి అక్షరాలను
అటకెక్కించి పిట్ట గూటిలో
నివసిస్తూ నిర్వీర్యులై
నీరుగారిపోతున్నారు
నేటి నేటిజనులు
ఎదురైన ముఖాన్ని
మనిషినీ విస్మరించి
చరవాణితో నిత్యం
సహజీవనం చేస్తున్నారు
చెట్లన్నీ పక్షులు లేక
వెల వెల బోయాయి
పక్షులు లేని చెట్ల వలె
బోసిపోయిన ఇల్లు
మాటలు లేక మౌనం తో
విల విలలాడిపోయింది
కళా కాంతులు కోల్పోయిన
సమాజం నిరుత్సాహంతో
నీరసించి నీరు గారిపోయింది
ప్లాస్టిక్ నవ్వులు నవ్వుతూ
ముఖ పుస్తకం ముక్కూ
ముఖం తెలియని
వారికీ స్వాగతం పలికే
పనిలో నిమగ్నమై పోయింది

–శ్రీష్టి శేషగిరి
9290652632

శ్రీశ్రీ మాటలను నిజం చేసిన కవి 'కుందుర్తి'

కుందుర్తి సమగ్ర కవితా సంకలనాలను ఆవిష్కరిస్తున్నఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్. చిత్రంలో శిఖామణి, కె. శివారెడ్డి, నందిని సిధారెడ్డి, తదితరులు.

సామాన్యుల నోళ్లలో నానే అలంకారాలు, పోలికలే కవిత్వంలోకి రావాలని తుది వరకు పరితపించిన కవి కుందుర్తి ఆంజనేయులు అని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి కన్వీనర్, ప్రముఖ కవి కె.శివారెడ్డి అన్నారు.

కవిత్వాన్ని ఆకాశపు దారుల నుంచి భూమార్గం పట్టిస్తానన్న శ్రీశ్రీ మాటలను కుందుర్తి నిజం చేశారని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ కవిసంధ్య సాంస్కృతిక సంస్థ యానాం సంయుక్త నిర్వహణలో కుందుర్తి ఆంజనేయులు శతజయంతి సభ ఆదివారం రవీంద్రభారతిలో జరిగింది, ఈ సందర్భంగా జరిగిన సదస్సులో స్వాగతోపన్యాసం చేసిన శివారెడ్డి, కవిత, కథ, నాటకం వంటి పలు సాహిత్య ప్రక్రియల్లో కుందుర్తి అనేక ప్రయోగాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్. 'హైరు' ప్రచురించిన 'కుందుర్తి సమగ్ర కవిత్వం' రెండు సంపుటాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక తెలుగు ప్రయాణంలో 'కుందుర్తి' ఒక ముఖ్యమైన మజిలీ అని శ్లాఘించారు. చిన్నచిన్న మాటలతో కుందుర్తి రాసిన కవితాపంక్తులు చదువుతుంటే కవిత్వాన్ని ఇంత సరళం చేయవచ్చా. అనే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. కుందుర్తి ప్రారంభించిన ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు ఆయన తదనంతరం కూడా వచన కవితా పరిణామాన్ని ప్రోత్సహిస్తుండడం విశేషమని ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా శీలా సుభద్రాదేవి కూర్చు 'యాభైవసంతాల ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డులు' కవిసంధ్య 'కుందుర్తి' శత జయంతి ప్రత్యేక సంచికలను తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. అంతేకాక, కుందుర్తి సాహిత్యంపై రోజంతా జరిగిన సదస్సులో పాల్గొన్న పలువురు కవులు వివిధ అంశాలపై ప్రసంగించారు. ఇక, ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నిఖిలేశ్వర్, కుందుర్తితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుందుర్తి మనుమరాలు కవిత మాట్లాడుతూ తెలుగు కవిత్వాన్ని తన తాత ప్రజాస్వామీకరించారని అన్నారు. కుందుర్తి సమగ్ర కవితా సంకలనాలను ప్రచురించిన హైరు నిర్వాహకులు శ్రీరాం పుప్పాల, అనీల్ ద్యానీ కృషిని వక్తలు అభినందించారు.

కల్లూరి భాష్కరం వ్యాసాల సంకలనం 'గాంధీత్వ నుంచి హిందూత్వ దాకా' ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కర

కరోనా-శతకం

-బండారు సునీత, 9440671530

నిబద్ధతతో నిర్బంధంలో ఉండు
నియంతలా తిరిగితే నింగికెళతావ్
గృహమే కదా స్వర్గసీమ
సునీత బండారు మాట సున్నితంబు !

కరోనా రగిల్చిన చిచ్చుకు
ప్రపంచమంతా అతలాకుతలం
నిర్లక్ష్యానికిది ప్రతిఫలం
సునీత బండారు మాట సున్నితంబు !

కరోనాని కట్టడి చేస్తున్నా కూడా
ఉన్నానని గుర్తు చేస్తుంది
వదలని జిడ్డు సూక్ష్మ జీవి
సునీత బండారు మాట సున్నితంబు.!

ప్రాణాలు సైతం లెక్కచేయక
ప్రజల సేవలో తత్పరులు
వైద్యులు కనిపించే దేవుళ్ళు
సునీత బండారు మాట సున్నితంబు.!

మోచేతి వరకు శుభ్రపరచు
మహమ్మారి కరోనాను మట్టుపెట్టు
నివారణ ఒక్కటే మార్గం
సునీత బండారు మాట సున్నితంబు.!

ఒక క్షణం నీ నిర్లక్ష్యం
విడనాడకపోతే అంతే
ఒక జీవిత కాలానికి యావజ్జీవం
సునీత బండారు మాట సున్నితంబు.!

ఎవరింట్లో వాళ్ళు ఉండాలి
జనాభా లెక్కల్లో అందరూ ఉండాలి
మన నిర్బంధమే మనకు రక్ష
సునీత బండారు మాట సున్నితంబు.!

నిబంధనలను ఉల్లంఘించారో
రెండవ విడత బలి తీస్తుంది
ఆత్మ రక్షణకు మాస్కే శరణ్యం
సునీత బండారు మాట సున్నితంబు.!

మిమ్మల్ని మీరే హతం చేసుకొనే
సోమరి పనులు మానుకో
ధనము జగములో నిప్పుడు శూన్యము
సునీత బండారు మాట సున్నితంబు.!

స్వీయనిర్బంధం ప్రతిరోజూ
తప్పనిసరి పాటించు
అదియె క్షేమదాయకము
సునీత బండారు మాట సున్నితంబు.!

అనవసరంగా బయట తిరిగి
కుటుంబమును బలి తీసుకోకు
మన జాగ్రత్త కుటుంబానికి రక్ష
సునీత బండారు మాట సున్నితంబు.!

బాహుబలివని భావించి
ఎన్నడూ విర్రవీగకు
మతి మాలిన చేష్టలు తగవు
సునీత బండారు మాట సున్నితంబు.!

విపత్కర స్థితుల్లో మనకు
క్రమశిక్షణ ముఖ్యం
నిర్లక్ష్యం వహిస్తే మరణమే
సునీత బండారు మాట సున్నితంబు.!

కరోనా కోరల్లో చిక్కుకుని
అల్లాడిపోతున్న అమాయకులు
ఆగమౌతున్న ప్రపంచ దేశాలు
సునీత బండారు మాట సున్నితంబు.!

ఉపాధి కోల్పోయిన కార్మికులు
ఇబ్బందులతోకుటుంబ సభ్యులు
ఎంతకాలం ఈ నిరీక్షణ
సునీత బండారు మాట సున్నితంబు.!

ఊరు కానీ ఊర్లో ఉండలేరు
సొంతగూటికి చేరలేరు
వలసజీవుల బతుకు అగమ్యగోచరం
సునీత బండారు మాట సున్నితంబు.!

కూడబెట్టినదంతా మాయం చేసి
బతుకును దుర్భరం చేసేసింది
మధ్యతరగతి బతుకు ఆగమాగం
సునీత బండారు మాట సున్నితంబు.!

శ్వాస వ్యవస్థపై ప్రభావకారి
మానవజీవన వినాశకారి
కనుకే ముందు జాగ్రత్తయే మందు
సునీత బండారుమాట సున్నితంబు.!

మీతో పాటు సమాజం ఉందని
తలచి భాధ్యతగా మెలగండి
భౌతిక దూరమే ముద్దని చాటండి
సునీత బండారు మాట సున్నితంబు.!

మనషులపై తీవ్ర ప్రభావం
జంతువులను కూడా వదలని వైనం
భయం గుప్పిట్లో ప్రాణులు
సునీత బండారు మాట సున్నితంబు.!

పొడి దగ్గుతో మొదలై
నిమ్మోనియాకు దారితీస్తుంది
చిన్న నిర్లక్ష్యం పెద్ద శిక్ష
సునీత బండారు మాట సున్నితంబు.!

శక్తివంతమైన వినాశకారి
కరోనా మహమ్మారి
ఎదుర్కోవడం మన వంతు
సునీత బండారు మాట సున్నితంబు.!

సామాజిక దూరం పాటించు
అవగాహనతో పయనించు
నిర్లక్ష్యం జీవిత కాలం మూల్యం
సునీత బండారు మాట సున్నితంబు.!

ముఖానికి మాస్కు కడదాం
సమావేశాలకు దూరంగా ఉందాం
స్వీయ నియంత్రణ మంత్రం కావాలి
సునీత బండారు మాట సున్నితంబు.!

మాయదారి జీవి యిది
మనుషులను మాయం చేస్తుంది
క్వారెంటైనే రక్షనని తెలుపుదాం
సునీత బండారు మాట సున్నితంబు.!

నిశబ్ద యుద్ధం చేద్దాము
ఆత్మవిశ్వాసమే ఆయుధంగా
కరోనాని తరిమి కొడదాం
సునీత బండారు మాట సున్నితంబు.!

అందర్నీ అతలాకుతలం చేస్తూ
వణికిస్తున్న సూక్ష్మజీవి
ప్రపంచం మొత్తం కరోనా గుప్పిట్లో
సునీత బండారు మాట సున్నితంబు.!

పారిశుద్ధ్య కార్మికుల త్యాగం
అందరి ఆరోగ్యం వారి నినాదం
వృథా చేయక ఇంటిపట్టునే ఉండండి
సునీత బండారు మాట సున్నితంబు.!

ఉద్యోగ నిర్వహణ వారి ధ్యేయం
త్యాగనిరతి అభినందనీయం
మానవ సేవయే మాధవ సేవ
సునీత బండారు మాట సున్నితంబు.!

మందే ఎండల్లో గస్తీ చేస్తున్న
రక్షకభటులకు మనం చేయాల్సింది
లాక్ డౌన్ పాటించడమే
సునీత బండారు మాట సున్నితంబు.!

రాత్రి పగలు వృత్తి నిబద్ధత
పౌరుల ఆరోగ్యమే వారి కర్తవ్యం
అన్నీ తెలిసి మసలుకో
సునీత బండారు మాట సున్నితంబు.!

కల్లోల పరిస్థితులు కట్టడి
అయ్యేవరకు ఇల్లు వీడకు
ప్రభుతకు చేయూతనివ్వు
సునీత బండారు మాట సున్నితంబు.!

వీధుల్లో యధేచ్ఛగా తిరగకు
దుర్మార్గులుగా మారవద్దు
అందరూ మనవారని మరవకు
సునీత బండారు మాట సున్నితంబు.!

వైరస్ వ్యాప్తిని అరికట్టుటకు
ఒక్కటే మిగిలిన మార్గం
ఎవరి ఇంట్లో వారుండుట
సునీత బండారు మాట సున్నితంబు.!

సిసలైన ప్రాణ బంధువులు
మనకిపుడు వైద్యులు
సేవలో నిమగ్నమైన యోధులు
సునీత బండారు మాట సున్నితంబు.!

తమ ప్రాణాలను పణంగా పెట్టి
కరోనాపై యుద్ధం చేస్తున్నారు
నిజమైన దేశభక్తులు వారు
సునీత బండారు మాట సున్నితంబు.!

కుటుంబాన్ని వీడి చేస్తున్న త్యాగం
భువిలో వెలసిన దేవుళ్ళు
చరిత్రలో సదా చిరస్మరణీయం
సునీత బండారుమాట సున్నితంబు.!

కనీ విని ఎరుగని కల్లోలం
పిట్టల్లా రాలుతున్న జనం
నిజమవుతున్న బ్రహ్మంగారి వాక్కు
సునీత బండారు మాట సున్నితంబు.!

కల్లోల పరిస్థితులు తొలగాలంటే
ప్రభుత్వ ఆంక్షలు పాటిద్దాం
అందరి తో పాటే మనం
సునీత బండారు మాట సున్నితంబు.!

అప్రమత్తతతో ప్రవర్తించి
కలిసి కట్టుగా కరోనాను తోలాలి
సమైక్యతే మనందరి నినాదం
సునీత బండారు మాట సున్నితంబు.!

స్వీయ క్రమశిక్షణ అంటే
పరిశుభ్రత,సామాజిక దూరం
పాటించుట ప్రతి ఒక్కరి ధర్మం
సునీత బండారు మాట సున్నితంబు.!

గుంపులుగాదరి చేరవద్దు
కరోనా పంజాకు గురికావొద్దు
దూరమే మనకిపుడు క్షేమం
సునీత బండారు మాట సున్నితంబు.!

అవసరాల సాకుతో బయటికెళ్లకు
ఇంట్లో చావును తెచ్చుకోకు
మన నిర్లక్ష్యం విలువ మనవారి ప్రాణం
సునీత బండారు మాట సున్నితంబు.!

విచక్షణారహిత ప్రయాణం
చేసి తెచ్చుకోకు వినాశనం
వినాశ కాలం వుందని తెలుసుకో
సునీత బండారు మాట సున్నితంబు.!

మొదటి విడత కరోన
మనకు బతుకు విలువ చెప్పింది
సాయం విలువ తెలియజేసింది
సునీత బండారు మాట సున్నితంబు.!

దేన్ని చిన్నచూపు చూడరాదని
జీవితం సూక్ష్మమైనదని తెలుసుకో
ఇది.మనకు కరోన చెప్పిన పాఠం
సునీత బండారు మాట సున్నితంబు.!

మనిషి ప్రకృతికి చేసే హాని తట్టుకోలేక
భూమాత ఒడిలో నుంచి పుట్టుకొచ్చింది
అందుకే ప్రకృతిని పరిరక్షిద్దాం
సునీత బండారు మాట సున్నితంబు.!

ప్రకృతిని గౌరవించి కాపాడి
మానవాళికి మనుగడని ఇద్దాం
ప్రకృతి మన నేస్తం
సునీత బండారు మాట సున్నితంబు.!

ప్రకృతి ప్రకోపము ప్రచ్ఛన్న యుద్ధం
ప్రకృతి మోదం సుఖ జీవనము
ప్రకృతియే మనకు రక్ష
సునీత బండారు మాట సున్నితంబు.!

నీలో ఉన్న శత్రువుని ఎదుర్కో
నీ అలవాట్లను మార్చుకో
సూక్ష్మ జీవి వుందని మరవకు
సునీత బండారు మాట సున్నితంబు.!

దురలవాట్లకు లోనుగాకు
భయం గుప్పిట్లో బతుకని మరువకు
అప్పుడే పృథ్విపై మనగలుగుతావు
సునీత బండారు మాట సున్నితంబు.!

నా ఇష్టం అన్నావో అంతే
పడగ విప్పి కాటెయ్యగ సిద్ధంగా ఉంది
కాలనాగు నీవెంటే ఉందని తెలుసుకో
సునీత బండారు మాట సున్నితంబు.!

తటస్థంగా ఉండుట పనికిరాదు
అవగాహన కల్పించటం ప్రథమం
చికిత్స కంటే నివారణ ముఖ్యం
సునీత బండారు మాట సున్నితంబు.!

చేతుల శుభ్రత మిన్న
పాటించకపోతే సున్న
జనాబా లెక్కలో మిగలవు
సునీత బండారు మాట సున్నితంబు.!

కరాళ నృత్యం చేస్తూ
తిరుగుతుంది కరోనా
ఆదమరిస్తే కాటేస్తుంది
సునీత బండారు మాట సున్నితంబు.!

రెండవ విడత వచ్చె
రోగము తీరే మారిపాయె
కోలుకునే లోపే కాటికి పంపె
సునీత బండారు మాట సున్నితంబు.!

చిటికెలో మాయం చేస్తూ
కాలగర్భంలో కలిపె మహమ్మారి
రెండవ విడత రోదనే మిగిల్చె
సునీత బండారు మాట సున్నితంబు.!

కనిపించని మూడవ యుద్ధం
ప్రపంచమంతా అల్లకల్లోలం
రంగులు మార్చి తిరిగె కరోనా
సునీత బండారు మాట సున్నితంబు.!

పెను సవాలు విసిరి
మృత్యు ఘంటికలు మోగిస్తోంది
వదలని కాలాంతకి కరోన
సునీత బండారు మాట సున్నితంబు.!

ఆర్థికవ్యవస్థ పునరుత్తేజానికి
అంతం కావాలి సూక్ష్మ జీవి
ఐక్యమత్యమే మన ఆయుధం
సునీత బండారు మాట సున్నితంబు.!

వైరస్ గొలుసు తెంపాలంటే
ప్రత్యమ్నాయాన్ని వెతకాలి
లేదంటే అందరూ సమాదియె
సునీత బండారు మాట సున్నితంబు.!

మానవ మేధకు విసిరిన సవాలు
ఎదుర్కోవడమే సరైన జవాబు
ముల్లును ముల్లుతో తీసే చరిత మనది
సునీత బండారు మాట సున్నితంబు.!

క్షణకాలంలో మసి చేస్తుందని
రెండో విడత రుజువు చూపింది
మానవ బంధాలను తెంపేసిన కరోనా
సునీత బండారు మాట సున్నితంబు.!

నిశబ్దంలో ఆనందాన్ని వెతుక్కో
అదే ఆరోగ్యానికి మంచిది
ఒంటరి జీవితం సాగించాలిక
సునీత బండారు మాట సున్నితంబు.!

కరుణంటే తెలియని మహమ్మారి
ప్రజలను కన్నీటిపాలు చేసింది
పేదవారి పొట్టను కొట్టిన కరోన
సునీత బండారు మాట సున్నితంబు.!

భౌతిక దూరం పాటించు
కుటుంబాన్ని క్షేమముగా ఉంచు
ఇప్పుడు అదియే తరుణోపాయం
సునీత బండారు మాట సున్నితంబు.!

మన అజాగ్రత్త ఫలితం
లాక్ డౌన్ ను పెంచింది
ఇకనైనా జాగ్రత్తగా మసులుకో
సునీత బండారు మాట సున్నితంబు.!

కాలానికేదీ కొత్త కాదు
ఈ రోజు కరోనా రేపు మరోటి
ఎప్పుడైనా యుద్ధం తప్పదు
సునీత బండారు మాట సున్నితంబు.!

కాలమెప్పుడూ మనకు
సవాళ్లు విసురుతూనే ఉంటది
ఎదుర్కోవడం మన వంతు
సునీత బండారు మాట సున్నితంబు.!

కాలుష్య చీకటిలో చిక్కుకోకు
పరిశుభ్రతను పాటించు
కదనాన కవచంగా మారు
సునీత బండారు మాట సున్నితంబు.!

రాజుల కైనా వదలనిది
డబ్బుకు కూడా లొంగనిది
అందరూ సమానమే అన్న కరోన
సునీత బండారు మాట సున్నితంబు.!

అనుక్షణం జాగురూకత
ఇదే సిసలైన విరుగుడు
అప్రమత్తతనే ఆయుధం
సునీత బండారు మాట సున్నితంబు.!

ఇంట్లోనే బందీ అయిన దేశం
విజృంభిస్తున్న సూక్ష్మ జీవికి
కనిపించకపోవడమే మేలు
సునీత బండారు మాట సున్నితంబు.!

కంటికి కానరాని సూక్ష్మజీవి
కంటికి కునుకు లేకుండా చేసింది
ఐకమత్యంగా ఎదుర్కొందాం
సునీత బండారు మాట సున్నితంబు.!

కష్టనష్టాలతో తల్లడిల్లుతూ
నిస్సాహాయులైన అభాగ్యులు
కరోనా నీ ప్రతాపమిక చాలించు
సునీత బండారు మాట సున్నితంబు.!

కిరీటమై మన ముందుకు వచ్చి
అన్నిదేశాల్నీ ఏలుతుంది
ఏదీ కలకాలం నిలవదు
సునీత బండారు మాట సున్నితంబు.!

చిన్నపాటి రోగులను
పొట్టన పెట్టుకుంటున్నావు
జీవ వైవిధ్యం పాటిస్తున్న కరోన
సునీత బండారు మాట సున్నితంబు.!

డబ్బు ఎంత వుంటే ఏమి
వెంట యేదీ రాదన్నావు
నిష్పక్షపాతి కరోనా
సునీత బండారు మాట సున్నితంబు.!

తన ప్రస్థానాన్ని కొనసాగిస్తుందంటే
మీ అలసత్వమే కారణం
కరోనా ను కట్టడి చేయాలి
సునీత బండారు మాట సున్నితంబు.!

సాయం చేయకున్నా పర్వాలేదు
అంటరానివారని వెలివేయకు
కాలమే అన్నిటికీ సమాధానం
సునీత బండారు మాట సున్నితంబు.!

సాగుతున్న మృత్యుఘోష
పసి ప్రాణాలకు పెద్ద ముప్పు
కాపాడుకోవడం మన కర్తవ్యం
సునీత బండారు మాట సున్నితంబు.!

ఒక చిన్నపాటి నిర్లక్ష్యం
లక్షల ప్రాణాలు మంట కలిశాయి
దేనినీ చిన్నచూపు చూడలేమింక
సునీత బండారు మాట సున్నితంబు.!

మాస్క్ ధరిస్తేనే అడుగేయాలి
గుమ్మం దాటకూడదని గుర్తెరగాలి
సమన్వయంతోనే ముందుకు సాగాలి
సునీత బండారు మాట సున్నితంబు.!

రాజు పేద తేడా లేనిది
తారతమ్యం లేని కరోనా న్యాయం
ప్రపంచం కోలుకునేది మీ చేతుల్లోనే
సునీత బండారు మాట సున్నితంబు.!

విద్యార్థుల చదువులు వారిభవిత
అస్తవ్యస్తమై అటకెక్కుతున్నాయి
రేపటి వేకువకై ఎదురుచూపు
సునీత బండారు మాట సున్నితంబు.!

కలిసున్నప్పుడే బంధాలు అంటూ
తోడనే వారు లేరని తేల్చేసింది
అందరిని కలుపుకుంటూ పొమ్మంది
సునీత బండారు మాట సున్నితంబు.!

వాయు వేగంతో పయనించి
మూడవ విడత హెచ్చరిక చేస్తోంది
గడప దాటకుండా మరింత పదిలం
సునీత బండారు మాట సున్నితంబు.!

ఋణ భారముతో పేద ప్రజలు
ఆర్థిక మందగమనంలో
మౌలిక వసతులు కరువయ్యాయి
సునీత బండారు మాట సున్నితంబు.!

ఎటు చూసినా శవాల గుట్టలు
కరోనా దెబ్బకిది ఆనవాలు
ఇలానే సాగితే అంతా శూన్యమే
సునీత బండారు మాట సున్నితంబు.!

జనాభా లెక్కల్లో తేడాలొచ్చాయి
కరోనా లెక్కలో కలిసిపోయాయి
కూడికలు లేవు అంతా తీసివేతలే
సునీత బండారు మాట సున్నితంబు.!

క్షేత్ర స్థాయిలో పాజిటివ్ కేసులు
వెలుపలకు రానివి ఇంకెన్నో
సత్యాలు ఎంత దాచినా దాగవు
సునీత బండారు మాట సున్నితంబు.!

మానవాళిని ఒక తాటిపై నిలిపి
రంగులు మారుస్తున్న జీవి
ఆలోచించి అడిగేయక పోతే ఇక అంతే
సునీత బండారు మాట సున్నితంబు.!

అస్థిరత ప్రబలి ప్రజారోగ్యం
పడకేసి కరోనా ఎగిసింది.
ఆర్థిక ప్రగతికి అవరోధమయ్యింది
సునీత బండారు మాట సున్నితంబు.!

ఎక్కడో పుట్టి విశ్వమంతా తాకింది
ఊపిరి నలిపేసి ఉసురు తీసింది
కరోనా భూత మాయాజాలం.
సునీత బండారు మాట సున్నితంబు.!

జీవితంలో అనుకోని కుదుపు
కరోనా వైరస్ తెచ్చిన మలుపు
విపరీత మార్పు ఎప్పుడూ చేటే
సునీత బండారు మాట సున్నితంబు.!

పొట్ట పోసుకునే నిరుపేదలు
కోవిడ్ కు రోజూ నైవేద్యాలు
కలసికట్టుగా ఆపాలిక మరణమృదంగం
సునీత బండారు మాట సున్నితంబు.!

కనిపించే దైవాలు వైద్యులు
కరోనాకిప్పుడు శత్రువులు
సదా వారి క్షేమాన్ని కాంక్షిద్దాం
సునీత బండారు మాట సున్నితంబు.!

భయం భయంగా జీవన యానం
పొట్ట తిప్పల కోసం తప్పని పయనం
ఎవరి కోసం ఏదీ ఆగదు
సునీత బండారు మాట సున్నితంబు.!

మందే ఎండ కూడా కరోనాను
ఏమి చేయలేకపోయింది
మాడిపోతున్న బతుకుల ఆనవాలు
సునీత బండారు మాట సున్నితంబు.!

సాయం కొరకు అన్నార్థులు
ఆశించిన రీతిలో ఆపన్న హస్తాలు
ఇంకా మిగిలి ఉన్న మానవత్వం
సునీత బండారు మాట సున్నితంబు.!

మరణ శాసనం లిఖిస్తున్న
కరోనాకు మరణమెన్నడో
తేల్చాల్సింది కాలమే
సునీత బండారు మాట సున్నితంబు.!

ఇంటి భోజనమే శ్రేయస్కరమంది
కలిసి పని పంచుకోమంటుంది
మంచి కెపుడు చేయి కలపమన్నది
సునీత బండారు మాట సున్నితంబు.!

వైరస్ వ్యాప్తి నెమ్మదిస్తుందనుకోకు
నీడలా వెంటాడుతుంది
రూపు మార్చే ఊసరవెల్లి
సునీత బండారు మాట సున్నితంబు.!

తన వాళ్లు ఎంతమంది ఉన్నా
అనాథలా మార్చేసిన కరోనా
మనిషి ఎప్పుడూ సామూహిక ఒంటరే
సునీత బండారు మాట సున్నితంబు.!

అంత్యక్రియలు చేయడానికి కూడా
కుటుంబ సభ్యులు ముందుకు రాని వైనం
అడుగంటుతున్న మానవత్వం
సునీత బండారు మాట సున్నితంబు.!

కోవిడేరూపంలో వచ్చినా కూడా
మాయం చేస్తుందని మరువకండి
స్వీయరక్షణనే శ్రీరామరక్షని
యాదికెట్టుకోండి
సునీత బండారు మాట సున్నితంబు.!

వ్యాక్సిన్ వేసుకొని
రక్షణ చర్యలు పాటించు
ధైర్యమే సరైన మందని స్తుతించు
సునీత బండారు మాట సున్నితంబు.!

కోవిడ్ మూడవ అల ఆగమంతో
చిన్నారులకు మరింత ప్రమాదం
వారి భద్రతే మన భవిత
సునీత బండారు మాట సున్నితంబు.!

ప్రజా రంజకం రావి రంగారావు కవిత్వం

-రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణలో డా॥ రావెల సాంబశివరావు

ప్రజా రంజకం డా. రావి రంగారావు కవిత్వం అని ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు తెలియజేశారు. గుంటూరు తాలూకా ఆఫీసు ప్రాంగణంలోని పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం ఉదయం ''అమరావతి సాహితీమిత్రులు'' నిర్వహించిన ''రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ సభ''లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రజా చైతన్యం రావి రంగారావు కవిత్వం లక్ష్యం అని, అందుకు తగిన కవిత్వ నిర్వహణ విధానాలు ఎంచుకొని నిబద్ధతతో అయిదు దశాబ్దాలుగా సాహిత్య సృజన చేస్తున్న రంగారావును అభినందించారు. కవిత్వం రాయటంతో పాటు ఎందరితోనో కవిత్వం రాయించిన ఘనత రంగారావుది అని తెలియజేసారు. వచన కవిత్వం పలచనై పోతున్న సమయంలో స్పష్టంగా సూటిగా భావ యుక్తంగా అభ్యుదయ విప్లవ భావాలతో దూసుకొచ్చిన శక్తి వంతమైన మినీ కవితకు ఒక ప్రత్యేక స్థానం కల్పించి కవిత్వ రచన ఒక ఉద్యమంగా భావించి దేశ మంతటా తిరిగి ప్రచారం చేసారని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డా. గుమ్మా సాంబశివరావు ప్రసంగిస్తూ కేవలం మినీ కవితలే కాకుండా విశిష్ట శైలిలో జన రంజక వచన కవిత్వం కూడా పండించారని చెప్పారు. ఇంకా బాల సాహిత్యం, బోధనా రంగ గ్రంథాలు, సరళ సుందరమైన శైలిలో పద్య గ్రంథాలు, పిల్లలలో కవిత్వ రచనా నైపుణ్యాల పరిశోధన మొదలైన గ్రంథాలు కూడా రాసి యాభై ఏళ్లలో యాభై పుస్తకాలు రాసారని రంగారావు కృషిని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడెమి బహుమతి గ్రహీత డా. పాపినేని శివసంకర్ మాట్లాడుతూ రంగారావు ఒక కావ్య కర్తగా చేస్తున్న సాహితీ కృషిని, ఒక సాహిత్య కార్యకర్తగా కూడా చేస్తున్న కృషిని మెచ్చుకున్నారు. ప్రముఖ సాహితీవేత్త డా. సూర్యదేవర రవికుమార్ మాట్లాడుతూ రంగారావు కవిత్వం నిరాడంబర సౌందర్య భరితం అన్నారు. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రంగారావు రచనల్లోని అభ్యుదయం, విప్లవ భావాల్ని ప్రస్తుతించారు. సభలో ప్రముఖ సాహితీవేత్తలు అబ్దుల్ రజా హుస్సేన్, ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోవేవల్లి వెంకట సుబ్బయ్య, ప్రముఖ సోషలిస్ట్ నాయకులు మోదుగుల పాపిరెడ్డి, నర్సీన్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డా. టి. సేవ కుమార్, ప్రముఖ కవి డా.రమణ యశస్వి, డా. వి. వి. సుబ్బారావు, గెల్లి రామమోహనరావు, గద్దె మంగయ్య, ఈపూరి వెంకటరెడ్డి మొదలైన వారు ప్రసంగించారు. "ప్రమిద" పత్రికను "రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక''గా విడుదల చేసిన సంపాదకులు బులుసు కామేశ్వరరావు దంపతుల్ని అమరావతి సాహితీమిత్రులు సత్కరించారు. వివిధ సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు,కళాకారులు, బంధు మిత్రులు రంగారావు దంపతుల్ని ఘనంగా సత్కరించారు. సంస్థ కన్వీనరు పింగళి భాగ్య లక్ష్మి, గిరిభూషణరావు, సూర్యనారాయణ, గింజుపల్లి బాపయ్య, నర్రా కృష్ణ మోహనరావు, గడల శివప్రసాద్ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు.

నిజమైన స్నేహితులు (కథ)

అనగనగా ఒక ఊరిలో నందు అనే అబ్బాయి ఉండేవాడు. వారిది చాలా పేద కుటుంబం. నందుకి పెట్టగా మిగిలినది వాళ్ళ అమ్మానాన్న తినేవారు. నందు చాలా బద్ధకస్తుడు. ఇంటి పనులలో కూడా ఎలాంటి సహాయం చేసేవాడు కాదు. బడికి కూడా సక్రమంగా పోయేవాడు కాదు. ఒకరోజు వాళ్ళ స్నేహితులందరూ మాట్లాడుకుంటుండగా నందు అక్కడికి వచ్చాడు. వాళ్లలో ఒక స్నేహితుడు నందు రేపటినుండి సెలవులు కదా ఏం చేస్తావురా అని అడిగాడు. ఇంకొక స్నేహితుడు అరేయ్ వాడు ఏమి చేయడు తిని పడుకుంటాడు. ఎందుకంటే వాడు బద్ధకస్తుడు కదా అని అంటాడు. వానికి తినడానికి తిండే దొరకకపోయినా వాడు ఎం పని చేయడు అని హేళన చేస్తారు.

ఆ మాటలకు నందుకి చాలా బాధ వేసింది. అప్పుడు తను ఏదో ఒక పని చేసి స్నేహితుల నోరు మూయించాలి అనుకున్నాడు. తనకు ఒక ఆలోచన వచ్చింది తన ఇంటి వెనక ఉన్న ఖాళీ స్థలంలోని చెత్తను గడ్డిని తీసివేసి కూరగాయలు పండించాలి అనుకున్నాడు. ఆ ఖాళీ స్థలం ను శుభ్రం చేసి తవ్వి ఉంచాడు కానీ తనకి విత్తనాలు దొరకలేదు, కొనడానికి తన దగ్గర డబ్బులు లేవు. తనకి అప్పుడు ఏమి తోచలేదు దిగులుగా నడుచుకుంటూ పోతూ ఉండగా ఒక దగ్గర ఒక సంచి దొరికింది. ఆ సంచిలో వంకాయ టమాట బెండకాయ మొదలగు విత్తనాలు ఉన్నాయి. అది చూసి నందుకి చాలా సంతోషం వేసింది. వాటిని తెచ్చి ఇంటి వెనుక నాటాడు. రోజు నీళ్లు పోసి పెంచాడు కొన్ని రోజులు గడిచినంక వాటికి చాలా కూరగాయలు కాసాయి. అవి అమ్మి చాలా డబ్బు సంపాదించాడు. తను చాలా సంతోషపడ్డాడు, వాళ్ళ స్నేహితులు దగ్గరికి వెళ్లి వారికి బుద్ధి చెప్పాలనుకున్నాడు. కానీ వాళ్ళ దగ్గరికి వెళ్లి విషయం చెప్పాక వాళ్ళు నవ్వారు.

నందుకి ఎం అర్థం కాలేదు. అప్పుడు వారు నువ్వు బద్ధకస్తుడివని నీ బద్ధకం పోగొట్టాలని మేమంతా నిన్ను రెచ్చగొట్టాము, నీకు కనబడేలా విత్తనాల సంచిని వేసింది కూడా మేమే అని చెపుతారు. మేము అలా చేయడం వలన నీవు తోటపని చేసి మీ అమ్మానాన్నకు సహాయపడ్డావు అంటారు. దానికి నందు మీరు నా నిజమైన స్నేహితులు. నా బద్ధకాన్ని పోగొట్టి నన్ను మార్చారు. మీకు ధన్యవాదాలు అని అంటాడు..

-వేల్పుల శ్రీలత, 9వ తరగతి
జి.ప.ఉ. పా నర్సింహుల పల్లి,
పెద్దపల్లి జిల్లా.



'హక్కుల వకీల్ కే.జీ. కన్నాభిరాన్ 24 గంటలు' పుస్తకావిష్కరణ

పౌరహక్కుల కోసం ఊపిరి ఉన్నంత వరకు పోరాడిన వ్యక్తి కేజీ కన్నాభిరావ్ అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నిఖిలేశ్వర్ అన్నారు. 'హక్కుల వకీల్ కేజీ కన్నాభిరాన్' 24 గంటలు' పుస్తకం ఆంగ్ల అనువాదం 'ది స్పీకింగ్ కాన్‌స్టిట్యూషన్‌ను ఆయన శనివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. దేవులపల్లి అజయ్ మాట్లాడుతూ కన్నాభిరావ్‌ను స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలని సూచించారు. పుస్తక ఆంగ్ల అనువాద కర్త కల్పన కన్నాభిరావ్, ప్రొ. హరగోపాల్, సీనియర్ సంపాదకుడు ఎన్.వేణుగోపాల్, ప్రొ.కంచె ఐలయ్య, దేవులపల్లి అమర్, తె.జ అధ్యక్షులు ప్రొ. కోదండరాం పాల్గొన్నారు.

"సిరివెన్నెల సమగ్ర సాహిత్యం", "నా ఉచ్ఛ్వాసం కవనం" పుస్తకాల ఆవిష్కరణ

ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన సమయంలో తీవ్రమైన పని ఒత్తిడిలో ఉడేవాడిని నిద్ర కూడా సరిగ్గా పట్టేది కాదు. ఉదయపు నడక సమయంలో సీతా రామశాస్త్రి పాటలు ఫోన్‌లో వింటుండేవాడిని.. అప్పుడే మనసు కాస్త ప్రశాంతంగా ఉన్నట్టు అనిపించేది.." అని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ తెలిపారు. విశాఖలో తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సిరివెన్నెల సమగ్ర సాహిత్యం 'నా ఉచ్ఛ్వాసం కవనం' రెండు మూడు సంపుటాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినీ రంగంలో శ్రీశ్రీ, ఆరుద్ర, సినారె వంటి కవుల తర్వాత తెలుగు భాషను తన రచనలు, సాహిత్యంతో బతికించి, గుర్తింపు తెచ్చినవారు సిరివెన్నెల సీతారామశాస్త్రి అని కొనియాడారు. తెలుగు సాహిత్యం కోసం సినిమాలు చూడాలనే కోరికను సీతారామశాస్త్రి తీసుకువచ్చారు. తెలుగుపాట ఏదో వెతుక్కోవాల్సిన పరిస్థితి నుంచి తెలుగు భాషకు ఇంత గొప్ప సాహిత్యం, చరిత్ర, మాధుర్యం, రుచి చూపింది సీతారామశాస్త్రి' అని అన్నారు. మహిళలను కించపరిచేలా యువత పెడదోవపట్టేలా పాటలు రాయకూడదని, సమాజంలోకి చెడు సాహిత్యం వెళ్లకూడదని, ఆయన నిర్ణయించుకున్నారు. సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం అది నేను రావిశాస్త్రి సాహిత్యానికి ఎక్కువ అభిమానిని' అని వివరించారు.

సోమవారం శ్రీ త్యాగరాయ గానసభలో 'ఎందరో మహానుభావుల మధుర స్మృతులు' కార్యక్రమంలో సభలో ప్రముఖ సాహితీవేత్త పాల్కురికి సోమనాథ కవి జయంతి సభలో గుండవరపు గీతాదేవి, త్రినాథరావు, గుదిబండి వెంకటరెడ్డి, కళా వి.ఎస్. జనార్ధనమూర్తి, చిక్కా రామదాసు.



ఈనెల 6 మంగళవారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'సాంస్కృతికబంధు' సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో ప్రముఖ సినీ రచయిత పి. సత్యానంద్‌కు ఆదుర్తి ఆత్మీయ ప్రతిభా పురస్కారం అందజేస్తున్న సారిపల్లి కొండలరావు, డా॥పాలకుర్తి మధుసూధనరావు, హెచ్.రమేశ్‌బాబు, జి. పల్లవి, ఎస్.వి.రామారావు, లంకా లక్ష్మీనారాయణ, అక్కినేని శ్రీధర్ తదితరులు.

మాయదారి చిలుకలు

ఇయ్యాల
ఇంటి ముందు వాలి
ముద్దు ముద్దు పలుకులైనారు ...!

ఇదేం కొత్తకాదు
ఐదేండ్లకోసారి
కడుపు నింపని మాటలజాబితా
కరపత్రాలు నింప

బాలాజీ మ్యూజికల్స్ ఆధ్వర్యంలో గాన విభావరి

గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

బాలాజీ మ్యూజికల్స్ నిర్వహించిన గానవిభావరి శ్రోతలను ఆకట్టుకుంది. త్యాగరాయ గానసభలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రామోజీతోపాటు పలువురు గాయనీ గాయకులు గీతాలు ఆలపించి శ్రోతలను రంజింపచేశారు. ఘంటసాల, ఎన్టీఆర్ శతజయంతి, లతామంగేష్కర్‌కు స్వరనివాళిగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు బాల కామేశ్వరరావు కనకరత్నం, లలితారావుకు శతజయంతి పురస్కారాలను బహూకరించారు. రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార గ్రహీత సాయిబాబ, జెన్‌కో అధికారి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పల్లె వెంకటేశ్‌కు సత్కారం

హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ పారిశ్రామికవేత్తల సెల్ కన్వీనర్‌గా నియమితులైన పల్లె వెంకట్‌గౌడ్‌ను ఆదర్శ సంస్థల డైరెక్టర్ వంగాల బాల్‌రాజ్‌గౌడ్ సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, మంజులగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నిజం

మనిషికి మనసుకి మధ్య దూరం పెరిగింది..
మనసుకి మమతకి కాలం చెల్లింది..
కష్టపడే తత్వం కనుమరుగై పోయింది..
కానీ కోరికల చిట్టా చాంతాదంత పెరిగింది..
స్నేహం స్వలాభానికి మూలం అయింది..
కలికాలం పూర్తిగా ప్రవేశించింది..
అంపశయ్యపై కనువిప్పు కలుగుతుంది..
అప్పటికే జరగాల్సింది జరిగిపోతుంది.

–దేవరకొండ లక్ష్మీనారాయణ
8985869475

బాధ్యత

బాధ్యత అంటే భారము కాదు
అది గీటురాయి నీ ప్రతిభకు
అది నీ సమర్థతకు అద్దం పట్టు!
రెక్కలు లేని రాకెట్ లో
బాధ్యతల శాటిలైట్ పరుగు!
వయసు పెరిగిన కొలది
ఎత్తుకు ఎదిగిన కొద్దీ
బాల్య కవచాలు ఊడి
బాధ్యతల భుజ కిరీటాలు మొలిచి
శాటిలైట్ స్థిర కక్ష్యలో తిరుగు!
బాధ్యత లోనే భద్రత వున్నది
మిన్ను విరిగి మీద పడుతున్నదా!
గ్రహాలు గతులు తప్పుచున్నవా!
కడలి చెలియలికట్ట దాటుతున్నదా!
ప్రకృతి పరిమితులను దాటితేనే
మనిషి బాధ్యత మరిస్తేనే బాధలు!
మనిషి బాధ్యతల వలయంలో
నిరంతరం పరిభ్రమిస్తున్నాడు!
కక్ష్య లేని ఆకాంక్షల లోకంలో
తరం తరం పరిశ్రమిస్తున్నాడు!
బాధ్యత బ్రతుకు తెరువుకు పురికొల్పి
ప్రజాజీవనాన్ని సుఖవంతం చేస్తుంది
ఎట్లావచ్చి పడుతుందో సహకారాల
బాధ్యత సల్లగుండ!

– పి.బక్కారెడ్డి
9705315250

కవిత్వమా?

కవిత్వం
ఒక అమృతమధనం
జీవం నింపేదిగా
చిరంజీవులుగా
నిలబెట్టేదిలా ఉండాలి
కవిత్వం
సంఘర్షణలో నుండి పుట్టేదా!?
సమన్వయంతో రమించేదా!?
కొందరికి విద్వేషం కవిత్వం
ఇంకొందరికి
ప్రేమతత్వం కవిత్వం
అందరికీ
నేదది స్వీయ అస్తిత్వపు అస్త్రం
వాదం ఎందుకు?
సంవాదం మన
వారసత్వ నైజం..
నిజంగా సంవాదం
కవులకి ఆలంబన కావాలే
సహనం మన
రక్తంలో నిండిన
హిమోగ్లోబిన్ కాదా!?
నేదది ఓ
పురాతత్వ శిలాజం....లా
ఎందుకు మారుతోంది..
అవార్డుల కోసం
అసహన ప్రదర్శనం
రివార్డుల కోసం
పైరవీ ల ప్రహసనం
కుహనా లౌకిక వాదం కోసం
ఎరుపు పచ్చగా
మారుతుంటుంది
మీరు గమనించారా!?
కలాలు
కంపుతో
కరుణరసం కురిపిస్తుంటాయి
మీరు గమనించారా!?
గళాలు విషంతో
బీభత్స రసం సృష్టిస్తుంటాయి
మీరు పరిశీలించారా!?
అకాడమీలకు
ఎరుపు పచ్చ
కలగలిసిన రసహీన
అలంకార హీన
అల్పత్వమే అందలం ఎక్కాలి
విశ్వ శ్రేయ కావ్యాల
సృష్టికర్తలు
శాస్త్ర రీతుల
సృజనకారులు....
కారెవ్వరు
ప్రతిభకు అర్హులు...
ఇలా మొదలైంది సంవాదం
మస్తిష్కమథనం లో
ఇది ప్రశ్న నా??
ఇది కవిత్వమా!?
మీరే
నిర్ణయించండి.,.....

– సాకి,
9949394688

అప్రమత్తతతో ఎయిడ్స్ అంతం

ఎయిడ్స్‌అంటువ్యాధికాదు
అంటించుకునే వ్యాధి
అవగాహన నీ ఆయుధం అవుతే
నిరంతర అప్రమత్తత తో
ఎయిడ్స్‌ను నిరోధించవచ్చు
ఎయిడ్స్ వచ్చిన వాళ్ళు కాదు విరోధి
అందరూ కలిసి ఎయిడ్స్ ను
అడ్డుకోవాలి
అదుపుతప్పిన విశృంఖల
శృంగారం
సురక్షితం కాని సెక్స్ వద్దు
జీవిత భాగస్వామితో సెక్స్ ముద్దు
పెళ్లికి ముందు లైంగికత్వం వద్దు
రక్తమార్పిడిలో జరిగే నిర్లక్ష్యం
వాడిన సిరంజీలను వాడ వద్దు
డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం
విశ్రుంకళ లైంగికతోన్మాదం
ఎయిడ్స్ వ్యాప్తికి రాచబాట
ఎయిడ్స్ మందులు లేవు
ముందు జాగ్రత్తలే ఎయిడ్స్‌కు మందు
ఎయిడ్స్ వ్యాధి అరికట్టడంలో
ప్రతి వ్యక్తి ఒక సైనికుడు కావాలి
ఎయిడ్స్ ను అరికడుదాం
ఆరోగ్య భారత్ ను ఆవిష్కరిద్దాం
నైతిక విలువలు పాటిద్దాం
కుటుంబ వ్యవస్థ పునరుద్ధరణతో
మానవీయ విలువలతో
వైవాహిక వ్యవస్థ ధర్మాన్ని రక్షిద్దాం
ఎయిడ్స్‌కు వ్యతిరేకంగ
సర్కారు చేసే పోరాటానికి
మద్దతు ఇద్దాం
కరోనా అరికట్టడంలో చూపిన శ్రద్ధ
హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణలో
రెట్టింపైన శ్రద్ధతో
జాగరూకులమై ఉండాలి
హెచ్ఐవి రోగులను తాకిన
కామన్ టాయిలెట్ వాడిన
ఎయిడ్స్ రోగి వాడిన వస్తువులను
ఉపయోగించిన ఎయిడ్స్ రాదు
కుటుంబ సభ్యులతో కలిసి
జీవించవచ్చు
ఎయిడ్స్ రోగుల పట్ల చిన్న చూపు
మానుకో మానవత్వంతో
సాటి మనిషిగా గుర్తించు
ఎయిడ్స్ రోగుల్లో జీవితం పై
"ఆశను" పెంచాలి
ఆశావహ దృక్పథంతో
ఎయిడ్స్ రోగుల్లో భరోసా భద్రతకు
చోట్టియ్యి
ఎయిడ్స్ రోగుల పట్ల
నిరాదరణ మానుకో
మనోధైర్యం అందించి ఆదరిద్దాం
ఎయిడ్స్ వ్యాధి సంక్రమణం
ఎయిడ్స్ వ్యాధి నివారణ పట్ల
అపోహలు ఆందోళన వద్దు
అవగాహనే ముద్దు
నిరంతర అప్రమత్తతతో హెచ్ఐవి
ఎయిడ్స్ ను అంతం చేద్దాం
ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు
ఉద్యమిద్దాం..

–నేదునూరి కనకయ్య
9440245771

ఇష్టం

ఆడవాళ్లకు
అలగడం అంటే ఇష్టం
ముసలి వాళ్ళకు
మూలుగుట ఇష్టం
పిల్లలకు
అల్లరి చేయడం ఇష్టం.

నిజాలు

సాలులో మొక్కనాటితె
పంటబాగా పడుతుంది–
ఆలుతో మంచిగుంటే
వంటబాగా వండుతుంది–
మద్యం తాగితే మత్తు పెరుగుతుంది
పద్యం చదువుతే జ్ఞానం పెరుగుతుంది–
ఈడు ముదరగానే జోడు కావాలంటరు
జోడు పోగానే కాడుకావాలంటారు.

– సిరిగాద శంకర్
సెల్: 9493301985

కవిత్వం ఆయుధం కావాల్సిందే

ఎక్కడో కవిత్వం కన్నీటి చుక్కలు
రాలిపోతున్నాయి
నేల మీద ఆకాశం మీద
అరణ్యం లోనా సాగరంలోనా
చల్లగాలి నిండా కవిత్వం కన్నీరే

నా అక్షరాలు కన్నీటి చుక్కలైనా
ఆకాశంలో నక్షత్రాలుగా మెరుస్తుంటాయి
నా మనసు గాయాల వైరుధ్యం
నా ఆత్మ పరమాత్మ సంగీతం.

జనం కన్నీటి చుక్కలు
ఎర్రబారిన కనులు
ప్రతీకార పిడికిళ్ళు
ఉద్యమాల కెరటాలు
అప్పుడప్పుడు కవిత్వంగా మారుతున్నా
నా అక్షరాల నిండా కన్నీటి చుక్కలే
జనం కన్నీరే కవిత్వమైనప్పుడు
రేపు తెల్లవారటానికి కవిత్వం
ఆయుధమై మెరవాల్సిందే

–సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

సామాజిక కళ్యాణం.. తుమ్మల కవిత్వ ఆశయం

ఆధునిక తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేసిన మహాను భావులలో,మహాకవులలో "యుగ కవి"గా, "మహాత్ముని ఆస్థాన కవి" గా ప్రసిద్ధులైన 'తెనుగు లెంక' తుమ్మల సీతారామమూర్తి గారిని ప్రముఖులుగా పేర్కొనవచ్చు.

తుమ్మల సీతారామమూర్తి గారి దేశభక్తి నిరుపమానం.

కొందరు కేవలం ప్రబోధా లతో.. నినాదాలతో సరిపెడతారు.

తుమ్మల వంటి వారు ఆచ రించి చూపుతారు.

తుమ్మల సీతారామమూర్తి గారి దృష్టి విశాలమైనది.

స్వార్థ సంకుచిత భావనలకు ఆయన వ్యతిరేకం.

నైతిక విలువలకు పట్టం కట్టడం,విశ్వశ్రేయోదృష్టి తుమ్మల ఆశయం.

సామాజిక సంస్కరణ సాధనం తుమ్మల కవిత్వం.

బాల్యం నుండే తుమ్మల జీవి తం ఆదర్శ భావాలతో సాగడానికి తండ్రి నారయ్య, తల్లి చెంచమాంబ ప్రధాన కారణం.

ఛాందస భావాలకు తుమ్మల వ్యతిరేకం.

"మనువు చెప్పెననుచు మా తాత మేనత్త ,
పాడెననుచు మొండిపట్టు తగదు,
మనువు మాట తన సమాజమునకు ,
మన మాటయన్న మన సమాజ మునకు" అంటూ తుమ్మల సందేశం ఇచ్చారు.

ఈ సత్యం జనానికి బోధపడితే నేడు సమాజంలో కనిపించే అనేక రాద్ధాంతాలకు అడ్డుకట్ట పడుతుంది.

కుల వ్యవస్థ దేశాన్ని , జాతిని దురవస్థలపాలు చేసిందని తుమ్మల ఆవేదనతో పేర్కొన్నారు.

అన్ని వృత్తులు సమానమైన వేనని ఎక్కువ తక్కువ భేదాలు తగదని హితవు పలికారు.

మహాత్మా గాంధీతో..గాంధీ భావజాలంతో పరిచయం ఏర్పడడానికి ముందునుండే తుమ్మల సత్యనిష్ఠ కలిగిన వారు.

గాంధీ ఆదర్శాల సాధనకు తుమ్మల తన కవిత్వంలో అధిక భాగం వెచ్చించి కట్టమంచి రామలిం గారెడ్డి గారిచేత "మహాత్ముని ఆస్థానకవి"గా ప్రశంసితులయ్యారు.

బాపూజీ ఆత్మకథ, మహాత్మ కథ, గాంధీగానం వంటి రచనలు తుమ్మల కీర్తిని అజరామరం చేసాయి. తుమ్మల వారి జాతీయాభిమానం..

ఆంధ్రాభిమానం చాలా గొప్పవి.

"నైతిక పునరుజ్జీవన
జాతీయవికాస,విశ్వజనతాశ్రేయః ,
ప్రీతము మచ్చేతము, నా కైతము తద్దర్పణమ్ముగా నుదయించున్' ,
"ఈ మేనెంత నలంగిన ,
నా మనుగడ లోకసేవనమ్మున కిడెదన్ ,
సామాజిక కళ్యాణము,
కావించెద నవ్యభవ్య కవితాసృష్టిన్"

అంటూ తుమ్మల ప్రతిజ్ఞాపూర్వ కంగా పలకడంతో పాటు వాటికి కట్టుబడి జీవించారు..తత్పంబంధమైన రచనలే చేసారు. కాలానుగుణంగా సమాజంలో వస్తున్న మార్పులను తుమ్మల గుర్తించారు.

చెడును గర్హించారు.

మంచిని హర్షించారు.

తన కవిత్వం ద్వారా తుమ్మల సమాజానికి మార్గదర్శనం చేసారు.

అందుకే తుమ్మల "యుగకవి" అయ్యారు.

సత్య దర్శనం చేసిన వారిని ఋషులుగా..మహర్షులుగా పేర్కొం టారు.

తుమ్మల సీతారామమూర్తిగారిని "కవిత్వ మహర్షి" గా మనం సంభావించవచ్చు.

కవిత్వంలో చమత్కారం కన్నా యుగలక్షణం

గుబాళించాలని,నేల విడిచి సాముచేసినట్లుగా కవిత్వం ఉండరా దని తుమ్మల కవులకు ప్రబోధించారు.

సామాజిక దురన్యాయాలను ,

అసమానతలను, దోపిడీ విధానా లను,పెత్తందారీతనాన్ని తుమ్మల సహించలేదు.

వాటిపై తన కవిత్వం ద్వారా తిరుగుబాటు చేసారు.

విప్లవ భావాలను పద్య కవిత్వం ద్వారా ప్రకటించారు. తెలుగు కవిత్వంలోని అన్ని ప్రక్రియలు తుమ్మల అనే కవిత్వ సంద్రంలో సంగమిస్తాయి.

దేశంలో నేడు ఎక్కడ చూసినా కొరతలే కనిపిస్తూ ఉండటాన్ని తుమ్మల సహించలేకపోయారు.

అవినీతి, కుల మత వర్గ విభేదాలు సమాజంలో నానాటికీ పెచ్చు పెరుగుతున్నాయని,

పదవీ వ్యామోహం పెరిగిందని,

నీతి నియమాలు దిగజారుతున్నా యని,

పేదలు మరింత పేదలుగా, సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారని తుమ్మల పేర్కొ న్నారు.

రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం యువతను రెచ్చగొట్టడం, తప్పుదారి పట్టించడం తగదని తుమ్మల హెచ్చరించారు.

దేశ స్వాతంత్ర్యం అన్ని సమస్య లను పరిష్కరిస్తుందని ఆశపడితే కొత్త సమస్యలు పెరుగుతున్నాయని తుమ్మ ల ఆవేదన చెందారు.

మహాత్మా గాంధీ అస్తమయంతో కర్తవ్య నిష్ఠ అనేది కూడా అంతరిం చిందని , నేడు దేశంలో పదవుల కోసం కొట్లాట తప్ప మరేమీ లేదని తుమ్మల ఆక్షేపించారు.

ప్రజలలో, నాయకులలో భోగ భాగ్యాలను అనుభవించాలనే ఆకాంక్ష పెరిగిందని, ధర్మము తలకిందుల వుతున్నదని తుమ్మల పేర్కొన్నారు.

డబ్బున్నవారికే పెత్తనాలు లభిస్తున్నాయని, పేదలు జీవచ్ఛవా లుగా బ్రతుకవలసి వస్తున్నదని తుమ్మల విశదీకరించారు.

దేశభక్తులు కలికానికి కూడా కానరాకుండా పోతున్నారని, ప్రజల లో కుల మత ప్రాంతీయ ద్వేషాలను నాయకులు పెంచి పోషిస్తున్నారని , ఐక్యత ప్రశ్నార్థకంగా మారిందని తుమ్మల ఆక్షేపించారు.

గాంధీ మార్గంలో పయనించడం ద్వారానే దేశ సమస్యలు పరిష్కారమ వుతాయని తుమ్మల విశ్వసించారు.

పదిమంది గద్దెల మీద కూర్చుని పెత్తనం చేసినంత మాత్రాన ప్రజల సమస్యలు పరిష్కారం కావని తుమ్మల స్పష్టం చేసారు.

తమకు నచ్చని నాయకులను, పాలకులను ఎదిరించ గలిగే ధైర్యం ప్రజలలో వచ్చినప్పుడు మాత్రమే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అని తుమ్మల చాటారు.

పేదరికాన్ని నిర్మూలలిస్తామనే నాయకుల మాటలలోని

డొల్లతనాన్ని తుమ్మల బయట పెట్టారు.

యువతి నేడు ఒంటరిగా ఇల్లు చేరుకోవడం కలేననే కరకు సత్యాన్ని తుమ్మల తెలియ చెప్పారు.

మదపు మూకల నుండి సమా జంలో స్త్రీలకు, చివరకు పసిపాపలకు, పండు ముదుసలులకు సైతం రక్షణ లేని దీనదృశ్యాన్ని, పాలకుల చేతగా నితనాన్ని తుమ్మల నేరుగానే చాటి చెప్పారు. మనుషులలో నీతి నియ మాలు లోపిస్తే సమాజం అరాచకం కాకుండా, కీచకుల స్వర్గంగా మార కుండా ఎలా ఉంటుంది? సమాజం లోని ఇటువంటి దుష్ట వైఖరులను తొలగించేందుకు కవులు రచయితలు తమ రచనల ద్వారా కొంతైనా కృషిచేస్తే తుమ్మల ప్రబోధానికి న్యాయం చేసినవారవుతారు. ఇంతకీ దేవుడు ఎక్కడుంటాడు? ఈ ప్రశ్నకు భాగవతమైతే ఇందు

గలడందులేడను సందేహము వలదు..భగవంతుడు సర్వాంతర్యామి అంటూ సమాధానం చెప్పింది.

అయితే 'తెనుగు లెంక' తుమ్మల మాత్రం

"కోవెలలో,గంగానది రేవులలో, రామకోటి రేఖలలో, లే ,
దేవాని యెదద కరుణకు, నావాలంబతనియంద హరి వసియించున్" అంటూ కరుణ కలిగిన హృదయమే దైవ మందిరమని, కరుణ కలిగిన హృదయాలలోనే భగవంతుడు నివాసం ఉంటాడని విశదం చేసారు.

"మానవ సేవే మాధవ సేవ" అనే సత్యాన్ని తుమ్మల నేర్పుగా తెలియ చెప్పారు.

సంక్రాంతి వంటి పండుగ కవి తలు తుమ్మల సంస్కరణ దృక్పథాన్ని వెల్లడి చేస్తాయి. ప్రతిపూట ప్రతి ఇంటా సుఖశాంతులు వెల్లివిరి సేలా చేయాలంటూ తుమ్మల సంక్రాంతి లక్ష్మిని వేడుకున్నారు.

పండుగల అంతరార్థం పప్పుభో జనాలు , పాయస సేవనాలు కాదని ,తమలోని లోపాలను మానవులు గుర్తెరిగి వాటిని తొలగించుకుని పరిపూర్ణతను సాధించేవైపు అడుగులు వేయడమని తుమ్మల ఎరుకపరిచారు.

ప్రపంచ శాంతి,విశ్వమానవ కళ్యాణం, మానవుల మధ్య సోదరభా వం పెంపొందడం తుమ్మల ఆశయం.

అమెరికా , రష్యాల మధ్య.. భారత పాకిస్తాన్ ల నడుమ శత్రుత్వం తొలగిననాడు , దళితులు, బ్రాహ్మణు లు బంధువులుగా మారిన నాడు, వ్యాపారంలో నిజాయితీ పెరిగిననాడు సమాజంలో చాలా సమస్యలు పరిష్కా రమవుతాయని తుమ్మల పేర్కొన్నారు.

తుమ్మల దేశభక్తి నిరుపమానం.

1962 లో చైనా భారతదేశం పై దురాక్రమణకు దిగినప్పుడు చైనా తీరును ఎండ గడుతూ తుమ్మల పద్యాలు రచించారు.

సత్య అహింసలను ప్రాణంగా భావించే భారతదేశం పై చైనా దాడికి పాల్పడడాన్ని తుమ్మల సహించలేకపోయారు.

బౌద్ధ ధర్మం మాది అని చెప్పుకునే చైనా భారతదేశం పై దాడికి పాల్పడడం పాలను వదిలి మద్యాన్ని తాగినట్లుగా ఉందని తుమ్మల ఆక్షేపించారు.

సైనిక బలగాన్ని చూసుకొని చైనా మురిసిపోవడం తగదని ఒక్కొక్క భారత సైనికుడు వజ్రంతో సమానమని యుద్ధంలో యమధర్మ రాజు నైనా ఎదిరించ గలిగే ధైర్య సాహసాలు భారతీయుల స్వంత మని తుమ్మల స్పష్టం చేసారు.

చైనా కుయుక్తులు మానుకో వాలని హితవు పలికారు.

మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారం భించి నప్పుడు తుమ్మల సీతారామ మూర్తి గారు ప్రభుత్వానికి పన్నులు చెల్లించ వద్దంటూ తప్పెట మ్రోగిస్తూ గ్రామాలలో ప్రచారం చేసారు.

ఖాదీ ప్రచారం నిర్వహించారు.

కావూరు గ్రామానికి విచ్చేసిన గాంధీ మహాత్ముని ప్రత్యక్షంగా దర్శించి విరాళంతో పాటు సన్మానపత్రం సమర్పించి తుమ్మల గాంధీమహాత్ముని ప్రశంసకు పాత్రులయ్యారు.

శత్రువునైనా ఆదరించి గౌరవిం చడమే గాంధీ మార్గమని, ఈ విశిష్ట గుణం అందరిలో పెంపొందాలని తుమ్మల ఆకాంక్షించారు.

గాంధీని ప్రత్యక్షంగా దర్శించ డం, గాంధీపై కవిత్వం రచించడం తో తన జన్మ ధన్యమైనట్లు తుమ్మల భావించారు.

మహాత్మునికి భక్తితో అంజలిం చారు.

సామాజిక సంస్కరణ యోధుల ..మహా కవుల సమ్మిళిత రూపంగా తుమ్మల సీతారామమూర్తి గారిని మనం సంభావింపవచ్చు.

'తెనుగు లెంక'

తుమ్మల వంకలేని తెలుగు సాహితీ నెలవంక..పూర్ణ శశాంక.

(డిసెంబర్ 25 'తెనుగు లెంక' శ్రీ తుమ్మల సీతారామమూర్తి జయంతి సందర్భంగా)

తమకు నచ్చని నాయకులను, పాలకులను ఎదిరించ గలిగే ధైర్యం ప్రజలలో వచ్చినప్పుడు మాత్రమే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు

–ఎం.వి.ఎస్.శాస్త్రి,
9948409528

మట్టి మనిషి

మట్టిపై మమకారం
రైతన్నకు ఎల్లవేళలా
అమోఘమైంది.
పసిడి పంటలకు మూల కర్త
ప్రపంచమంతా నయన మనోహర జాలంలో మునిగిపోయినప్పుడు
పచ్చని చీర కట్టిన పల్లెటూరు మహత్తరమైంది.
జీవితం విశుద్ధమైంది
రైతు లేనిదే రాజ్యం లేదు...
రైతు విశాలమైన వేదికపై ఎల్లప్పుడూ
పంట చిరులకు మూలం అతనే కదా
ప్రపంచమంతా అతని చుట్టూరా అన్నం కోసం తిరుగుతుంది
ప్రపంచంలో మహోన్నతుడు మట్టి
మనిషే కదా.
మట్టి బ్రతుకు బ్రతికే కదా మట్టి సుదీర్ఘమైన జీవితం అతనికి
భూమి తల్లి అతనికి ఎప్పుడు కూడా ప్రేమను అందించే
మట్టి మనిషి బ్రతికే బ్రతుకు మట్టి బ్రతుకు మహత్తరమైంది.
అతని గురించి
ఎంత వ్యాఖ్యానించినా సరిపోదు
అతని గురించి ఏం చెప్పినా అది అద్భుతమైన
కదా కావ్యం సుందరే
మట్టి మనిషి జీవితం అంటే నాకు ఇష్టం.

–డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు,
7702537453

సాగిపో..!

కాలంతో పాటు పోటీ పడి సాగిపోవడమే కదా జీవితం..
ఎన్ని ఆటుపోట్లు ఉన్నా ఆగకుండా సాగడమే కదా జీవితం..

తీరం దాటి వెళ్లలేమని తెలిసి కూడా
అలలు ఎగసిపడకుండా ఆగిపోతున్నాయా..

కష్టాలు ఎన్నో చుట్టుముట్టాయని మన జీవితాన్ని ఆపేసుకుంటామా..
చుక్కనీరైనా తాను తాగలేనని తెలిసి కూడా మేఘం వర్షించడం మానేస్తోందా..

కాసే ప్రతీ కాయా తాను తినలేనని తెలిసి
వృక్షం ఫలాలు అందించడం మానేస్తుందా..

అందుకే ఓ మనిషీ నీవు చేసే పనులు
నీకు ఉపయోగపడడం లేదని వెనకడుగు వేయకు.

నీ వల్ల ఒక్కరైనా సంతోషిస్తే నీ జన్మ ధన్యం కాదా...
అందుకే ఓ మనిషీ..!!
సాగిపో ఒక్కో అడుగు ముందుకు వేస్తూ
ఆగిపోకు ఎక్కడా .. కాలంతో పాటు సాగిపో..

–దేవలపల్లి సునంద
9291599562

పుస్తక సమీక్ష

రెక్కతొడిగిన స్వేచ్ఛా కవిత్వ సంపుటి- ఉప్పల పద్మ కవితలు



నేలతల్లిని నమ్ముకున్నోళ్లు, రెక్కల కష్టం మీద బతికేటోళ్లు, కరోనా కారిణ్యంలో అడుగుల గాయాలతో కన్నతల్లి ఉన్న ఊరు యాదికొచ్చిన వలస జీవులు, గుప్పెడు మెతుకుల కోసం గుడ్డికొం గలైన అనాథలైన తల్లిదండ్రులు, దీనులు, బడుగునోళ్ళ జీవన కథలు రెక్కలు తొడుక్కుంటున్న అక్షర కవితా చిత్రాలుగా కవయిత్రి శ్రీమతి ఉప్పల పద్మ చిత్రీకరించారు. **'రెక్క తొడిగిన వాక్యం'**, కవితా సంకలనంలో **'బోధపడని సత్యం'** కవితలో **"చేన్లు మేసే కంచెలున్నంత కాలం కమనీ యం ఈ నాటక రంగం.."** **"ఆశల పల్లకి మోస్తున్నన్నాళ్లు బోధపడదు బందీవన్న సత్యం"** అంటారు కవయిత్రి. 52 కవితలున్న ఈ సంపుటిలో, నిజాన్ని సామాజిక స్పృహతో నిక్కచ్చిగా వ్యక్తం చేస్తూ పీడితుల పక్షాన ప్రశ్నించడం, ప్రతిబింబింపచేసారు. ఆడపిల్లలను ఎటువంటి వివక్ష లేకుండా, మగపిల్ల లతో సమానంగా పెంచాలని, ఆమె పుట్టుకే శాపమన్న మూర్ఖులున్న కాలంలో ఆమె పట్ల అత్యాచా రాలు, అన్యాయాలను ఖండించి నిలదీయాలని ఆమెను స్వేచ్ఛగా బతకనివ్వాలని **'ఆమె ఓ మనిషే..'** కవితలో "మగాడని మహారాజుని చేస్తరెం దుకు...? అంటూ సూటిగా ప్రశ్నిస్తారు. 'ఆమె ఒక మేఘం'లో ఆమె పాతి వ్రత్యం పేర పురాణాల్లో పాతరేసిన పాత్ర ల్నేకాదు, పోరాట పటిమ రగిలిస్తూ, ఉగ్రరూపం దాలుస్తూ కాలాంతకు లను కాలుస్తుందని హెచ్చరిస్తారు. ఈ సంపు టిలో స్ఫూర్తినిచ్చు ఐలమ్మ, కమ్మని పాటల కోయిల కులుకై.. యుద్ధం, ప్రతీ పాటకు పల్లవి, కలుపుతిద్దాం, ఆశయం– ఆచరణ, తొలి పొద్దు (ఉస్మానియా) దండ కారణ్యం దారి లో.. భావల –భాష వంటి వైవిధ్య భరితమైన కవితలు చోటు చేసుకొ న్నాయి. 'నగ్న సత్యం' కవితలో **"అక్షరాలే లేపనంగా ఆవేదన తీర్చాలని**
అమ్మ ప్రేమై పటు శక్తినివ్వాలని
పదాలతో పాదాలు పాదుకలల్లి
పారే నెత్తుటి ధారను కలంలో నింపుకున్న
అందుకే నాకలం రుధిర ధారనే పారిస్తుంది" అంటారు. ఈ సంపుటిలో రెక్క తొడిగిన కవితా స్వేచ్ఛా విహంగంగా, కవయిత్రి ఉ ప్పల పద్మ. వర్తమాన సమాజ గమ్యాన్ని కవితా రూపంగా ఆవిష్కరించారు.

ప్రతులకు: ఉప్పల పద్మ
వై/ఆఫ్ ప్రకాశం, ప్లాట్ నం. 107,
ఇ.నెం.8–355/1/2
ఎమ్.ఎన్.రెడ్డి నగర్, ఫేజ్–II.
జీడిమెట్ల పోస్ట్, సుచిత్రా
హైదరాబాద్–500 067.
సెల్: 9951445867

–జయసూర్య
90149 48336
9394775088

పుస్తక సమీక్ష

'అరుణాక్షరాలు' ప్రజాపక్ష అభ్యుదయ కవయిత్రి-అరుణజ్యోతి



పూర్వపు మనువు సృష్టించిన మగువగాకుండా నేటి మహిళా అభ్యుదయ రచయిత్రిగా కులమత భేద భావాలు, మూఢ నమ్మకాలు, ఆచారాలు అంతరించాలని, సమ సమాజం ఆకాంక్షిస్తూ సాహిత్యం ప్రవృత్తిగా సమాజంలో మార్పు సాధించే సాహితీవేత్తగా, రచయిత్రి నాగిరెడ్డి అరుణజ్యోతి, అరుణాక్షరాలు సాహితీవేత్తగా, రచయిత్రి నాగిరెడ్డి అరుణజ్యోతి, అరుణాక్షరాలు తొలి కవితా సంపుటి వెలువరించారు. వివిధ సందర్భాలలో రాసిన 85 కవితల సంపుటి కవయిత్రికి కుటుంబ నేపథ్యం ప్రసాదించిన స్వేచ్ఛ, సమానత్వం,మానవతా విలువలు, ప్రకృతి మిత్రత్వం వంటి ప్రగతిశీల భావాల పట్ల అభిరుచి, నిబద్ధత, జీవన లక్ష్యం స్పష్టమవుతున్నాయి. ఈ సంకలనంలోని కవితల భావ వ్యక్తీకరణలో ఎటువంటి గోప్యత, క్లిష్టత వుండదు. స్పష్టంగా ఆమె మనసులోని సంతోష, విషాదాలను, అనుభవాలను, ఆలోచనలను సామా జిక స్పృహతో, ఇతివృత్తం ఆధారంగా శ్రీమతి అరుణ జ్యోతి అందించారు. కవిత్వీకరణ కంటే, అందరికీ స్పష్టం గా అర్థమయ్యే భావ వ్యక్తీకరణకు 'అరుణాక్షరాలు' కవితా సంపుటి ప్రాధాన్యత యిస్తోంది. వృత్తిరీత్యా సాహిత్య పఠనానికి 'కాలం కలిసి రానందుకే నా దిగులంతా' అంటారు అక్షరాలే నా ప్రపంచం కవితలో. ప్రకృతిని ప్రేమించే కవితా హృద యంతో చెట్టు, చెరువు, వర్షం, నేల, నీరు, పక్షి మనిషి మనుగడ ప్రస్తుత సమాజంలోని చెడులను కళ్లకు కట్టినట్టు చూపిస్తారు. **"ఇంట్లో ఆడపిల్లలు ఇంటి ముందర చెట్లకు పువ్వులు. పెరటిలో పండ్ల మొక్కలు నీమనస్సులో నవ్వుల జల్లులు"** అంటారు కవితాత్మకంగా ప్రభుత్వ అధికారిగా స్వచ్ఛభారత్, మిషన్ కాకతీయ, చెరువు నిండాలె– పల్లె మురవాలె, 'ఇంకుడు గుంత, హరితహారం బ్రతుకమ్మ వంటి కవితలలో సందేశాత్మకంగా సద్విష యాలు కవయిత్రి ప్రతిబింబింప చేసారు. ఓడిన మృత్యువు, పెరుమాళ్ పునరుత్థానం, వ్యాపం కుంభకోణం, పెద్దనోట్ల కలకలం, పునరావృతం వంటి కవితలు సం ఘటనలపై స్పందనలుగా సమాజం నడుస్తున్న తీరు తెన్నులను వివరి స్తారు.

"పార్లమెంటులో పట్టపగలు ప్రజాస్వామ్య ఖూనీ
అసెంబ్లీలో అధికార ఫీంకార వాణి
నిజాలు ఇజాలు అర్థంకాక జనాల పరేషానీ
భవిష్యత్ చిత్రం మార్చుకైనా సోంచానీ" అంటారు కలమెత్తి, గళమెత్తి ప్రశ్నించే కవయిత్రి శ్రీమతి నాగిరెడ్డి అరుణజ్యోతి, అరుణాక్షరాల సాక్షిగా..

ప్రతులకు: నాగిరెడ్డి అరుణజ్యోతి
ఇ.నెం.11–28, రోడ్ నెం.5
వినాయకనగర్ కాలనీ
సూర్యాపేట–508 213.
సెల్: 9966181561.

**

అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి పురస్కరించుకొని ఆదివారం వనస్థలిపురం భక్త సమాజం నిర్వహించిన సినిమా భక్తి గీతాలాపన పోటీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీ రామరాజును సత్కరిస్తున్న సి. హెచ్. ఐ. ఆర్. కె. మూర్తి, వి. సూర్యప్రకాశ్ తదితరులు.

ఘనంగా జరిగిన "మణిపూసల పంచశతి" పుస్తకావిష్కరణ మహోత్సవం!!

-ఆకట్టుకున్న అతిథుల ప్రసంగాలు.
-అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు.
-పరవశింప జేసిన అన్నమయ్య సంకీర్తనలు.

కాగ్నా కళా సమితి ఆధ్వర్యంలో డా. అర్క చంద్ర ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన తేది: 10.12.2022 నాడు తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లాలో ఉన్న తాండూర్ లోని తులసీ గార్డెన్ లో యువకవి తూర్పు బస్వరాజు రచించిన "మణిపూసల పంచశతి" పుస్తకావిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా ప్రముఖ సాహితీ వేత్త

దోరవేటి హాజరై ప్రసంగించారు. కవిత్వం సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తుందని, అది చిన్నదా, పెద్దదా అని కాదు. అందులో పాఠకుల హృదయాలను కదిలించే గుణం ఉండాలని చూసించార

ఎ. ప్రధాన వక్తగా విచ్చేసిన గంటా మనోహర్ రెడ్డి "శ్రీపద వడిచర్ల సత్యం సృష్టించిన మణిపూసల కవితా ప్రక్రియ అనతి కాలంలోనే తెలుగు నేల నలుమూలలకు విస్తరించి, రికార్డ్ స్థాయిలో బహుళ జనాదరణ పొందడమే కాకుండా మహామహులైన కవి పండితులచేత, విమర్శకులచేత ప్రశంసలను అందుకున్న ప్రామాణిక ప్రక్రియ. అవధానులు, లబ్ద ప్రతిష్టులైన కవులు మణిపూసల ప్రక్రియలో రచనలు చేయడం గొప్ప విశేషమన్నారు. నేడు ఎంతో మంది పెద్దలను, పిల్లలను ఆకర్షించి, కొత్త కవులను తయారు చేస్తోందని కొనియాడారు. తెలుగు సాహిత్యంలో సంచలనం సృష్టించిన మణిపూసల మార్గంలో తూర్పు బస్వరాజు రచించిన "మణిపూసల పంచశతి" గ్రంథంలో ఎన్నో విలువైన విషయాలు ఉన్నాయని పేర్కొన్నారు.

విశిష్ట అతిథులుగా వచ్చిన కందపద్య కవి సార్వభౌమ డా. రాధశ్రీ తన ప్రసంగం మొత్తం పద్యాలలోనే చేసి, అందర్నీ ఆకట్టుకున్నారు. ఛందస్సులో కోటాను కోట్ల రకాలు ఉన్నాయని, మాత్రా ఛందస్సులో వడిచర్ల సత్యం ప్రవేశ పెట్టిన నూతన కవిత "మణిపూస" కూడా ఒక రకమైన పద్యం కిందికే వస్తుందని చెప్పారు.

ప్రముఖ కవి, మణిపూసల రామాయణ రచయిత శ్రీ. టి. ఆశీర్వాదం "మణిపూసల పంచశతి" పుస్తకాన్ని పరిచయం చేస్తూ, అందులోని అనేక కవితలను మధురంగా పాడి వినిపించారు. రచయిత తూర్పు బస్వరాజును అభినందించారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కాగ్నా కళా సమితి అధ్యక్షులు శ్రీ పటేల్ శివకుమార్ (యోగా) మాట్లాడుతూ, నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన మణిపూసల ప్రక్రియలో కేవలం నాలుగు సంవత్సరాల కాలంలోనే వందకు పైగా పుస్తకాలు రావడం తెలుగు సాహిత్యంలో ఒక ప్రభంజనమే అని చెప్పారు.

ఆత్మీయ అతిథులుగా యాలాల్ మండల విద్యాధికారి శ్రీ సుధాకర్ రెడ్డి, మణిపూసల సృష్టికర్త వడిచర్ల సత్యం, తాండూర్ గీతా సత్సంగ సమితి నిర్వాహకులు చల్లా నారాయణ మరియు వికారాబాద్ జిల్లా తపస్ అధ్యక్షులు అంజిరెడ్డి, పి. ఆర్. టి. యు. రాష్ట్ర నాయకులు శ్రీ కల్లూరు వెంకట్ రెడ్డి, యాలాల్ మండల పి. ఆర్. టి. యు. అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, తపస్ అధ్యక్షులు శ్రీ గాజుల వీరేశం, విశ్రాంత తెలుగు పండితులు పి. హెచ్. నారాయణ రెడ్డి, తెలుగు ఉపన్యాసకులు మోహన్ రెడ్డి, మధుకర్ రెడ్డి, పాల్గొన్నారు. సయ్యద్ యూసుఫ్ సభా సమన్వయం చేశారు. కర్ణం వైష్ణవి బృందం చే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. రైల్వేకోడూరు నుండి వచ్చిన గాయకులు గంపల వాసుదేవ్ గారు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు సభికులను పరవశింప చేశాయి.

అనంతరం ఈ సమావేశంలో "మణిపూసల ద్విశతి"ని రచించిన కరణం మాణిక్ రావును, "ఓ నరుడ!" అనే మణిపూసల శతకమును రచించిన శ్రీమతి నాగజ్యోతి మహేష్ గౌడ్ ను, "మణిపూసల హారం", అక్షర మణులు" అనే రెండు పుస్తకాలను రచించిన బాలకవి బోయిని నాగరాజులతో పాటు ప్రముఖ కవి కోటం చంద్రశేఖర్, కవికెరటం గాజుల పవన్ కుమార్, హాజీపూర్ శ్రీనివాస్, వెంకట్ వంశిరాజ్, తిరుపతి, వెంకట్, శ్రీమతి టి. పద్మ లను ప్రత్యేకంగా సన్మానించారు. "యాలాల రసమయి"గా పేరుపొందిన కాగ్నా కళా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ మెట్లకుంట రాములు అలాపించిన సర్వతీ ప్రార్థనా గీతంతో ఆరంభమైన కార్యక్రమం వడిచర్ల సత్యం చేసిన వందన సమర్పణతో ముగిసింది. ఇందులో తాండూర్ నియోజక వర్గంలోని కవులు, రచయితలు, సాహితీ ప్రియులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని, వేడుకను విజవంతం చేశారు.

శతజయమంతి సినీ దిగ్గజాలకు స్వర నివాళి

ప్రఖ్యాత సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు, గాయకుడు ఘంటసాల, నటుడు నందమూరి తారక రామారావుల శతజయంతిని పురస్కరించుకుని త్యాగరాయ గానసభ ప్రదాన వేదికపై స్వరామృతధార సంస్థ సహకారంతో ప్రముఖ గాయకుడు టి. శరత్‌చంద్ర ఆధ్వర్యంలో స్వరనివాళి కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. శరత్‌చంద్ర ఈసందర్భంగా ఎన్టీఆర్ నటన, సాలూరి స్వరకల్పన, ఘంటసాల గానంలను విశ్లేషిస్తూ, నవరసాలు గీతాలను మధురంగా గానం చేశారు. శివరమ్య ధరణిప్రగడ, కిషోర్‌కుమార్, గణపతిరెడ్డి యుగళగీతాలు ఆలపించగా రామ్మోహన్ ఈలపాటతో ఆకట్టుకున్నారు. అనంతరం చల్లా సుబ్బారాయుడు, ఏ. అశోక్, లక్ష్మీ రమ తదితరులకు ఘంటసాల పురస్కారాలు బహూకరిం చారు. ఘంటసాల కోడలు కృష్ణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని ఘంట సాలకు గొప్ప గౌరవం ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉండటమేనన్నారు. శరత్‌చంద్రను అభినందించారు. జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారి ఐ. గణపతిరెడ్డి, కృష్ణవేణి పాల్గొన్నారు.

'వెంకటేశ్వర వైభవం' కవితా సంకలనం ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు.

శ్రీ వెంకటేశ్వరస్వామిపై పలువురు కవులు, కవయిత్రులు రచించిన పలు కవితల సంకలనం 'శ్రీ వెంకటేశ్వర వైభవం' పుస్తకాన్ని శ్రీ త్రిదండి రామానుజ దేవనాథజీయర్‌స్వామి ఆవిష్కరించారు. శ్రీ విజయలక్ష్మి దేవాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గట్టు రంగాచార్యులు దేవాలయం ప్రధాన అర్చకులు డా॥ఎస్. విజయ్‌కుమార్ ప్రజ్ఞారాజు, డా॥ రామ్‌సింగ్, గంటా మనోహర్‌రెడ్డి, కొడిచెర్ల మహేందర్, పాలడుగు సరోజినిదేవి, డా. విజయ, ఎం.వెంకటరమణ అతిథులుగా పాల్గొన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డా. జయప్రకాశ్, డా.పద్దేటి మల్లికార్జున్, బి. వెంకటేశ్వర్లు, డా.రాధాకుసుమలు పాల్గొన్నారు.



రాయలసీమ కథా కార్యశాల

రెండు రోజుల శిక్షణా తరగతులు
(కమలేశ్వరం సాహిత్య వేదిక సహకారంతో)

ప్రారంభోత్సవ కార్యక్రమం
డిసెంబరు 17, 2022 శనివారం ఉ॥ 10 గం॥లకు
వేదిక
ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, విశ్వేశ్వరయ్య భవన్, కడప

అధ్యక్షత
షేక్ హుస్సేన్ సత్యాగ్ని
సుప్రసిద్ధ కథా రచయిత

ముఖ్య అతిథి
ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి
సుప్రసిద్ధ కథా రచయిత

ప్రత్యేక అతిథులు
బండి నారాయణ స్వామి
ప్రసిద్ధ కథ, నవలా రచయిత

శాంతి నారాయణ
ప్రసిద్ధ కథ, నవలా రచయిత

వై. ప్రభాకర్ రెడ్డి
ప్రముఖ చరిత్ర ఉపన్యాసకులు

ఆప్త వాక్యం
పాలగిరి విశ్వప్రసాద్ రెడ్డి, ప్రముఖ కథారచయిత
పలమనేరు బాలాజీ, ప్రముఖ కవి, కథకుడు
హరికిషన్, ప్రముఖ కథారచయిత
డా. మూల మల్లి కార్జున రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, వైవియు

ఆహ్వానం
షేక్ షబ్బీర్ హుస్సేన్, కథారచయిత

గమనిక:
కార్యశాలకు కేవలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికి మాత్రమే అనుమతి. దయచేసి సహకరించగలరు

నిర్వహణ:
కొత్తపల్లి సురేశ్, వేంపల్లె షరీఫ్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 697వ రోజు 'నిరీక్షణ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'నిరీక్షణ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

అనంతమే...

తొమ్మిది నెలల నిరీక్షణ ఒక వంతు
పుట్టిన బిడ్డని చేతికిచ్చేలోగా నిరీక్షణ..
సృష్టిలో అద్భుతమైనదే !
చీటికీ మాటికీ తల్లిదర్శనం కోసమే..
ఉయ్యాలలో శిశువు చేసే
ఒట్టొట్టి ఏడ్పుల నిరీక్షణ
తల్లికి మురి"పాల" చేపులు!.
భర్త రాకకోసం పుట్టెడు పన్లో కూడా
ఇల్లాలి ఎదురుచూపులు
వాకిట్లో వదిలేచెప్పులు
అతనికి పనిభారం తొలగుతూ!.
అమ్మ ఊరెళ్తే ఏం బాలేదు..
కౌమారపు పిల్లల ఫిర్యాదు,
పెళ్ళో గృహప్రవేశమో వెళ్లక తప్పదుగా
అందాకా ఇల్లు అప్పగింతలు ఆమెకూ !
సంకేతప్రదేశంలో
ప్రేమికుల నిరీక్షణ రమ్యం
అల్లంత దూరాన ఆ తారక...!
పంట చేతిలో పడేవేళకు
శ్రమ మరిచే రైతు..
మూడునెలల నిరీక్షణలో
నిత్య బాలింత భూమి !.
తప్పు చేసో చేయకో
జైల్లో ఉన్నవాళ్ళు
తనవారి భేటీకి ఉన్న కొద్దిసమయం లో
కమ్ములకి తలాన్చి చేసే దీననిరీక్షణ !.
ఊకె కూసోలేక,
మక్కకండెలో
గెనిసి గడ్డలో ఉడకేసి
ఇస్కూలు ప్రహరీ బైట
గోతం పరిచి అమ్మే ముసిలవ్వ..
గాజుకళ్లలో అంతులేని నిరీక్షణ !
విశ్వమంతా నిరీక్షణ వలయం !!.

- ఎం. వి. ఉమాదేవి

నీకై...

నల్లని వాలుకనుల సోయగాలతో
వెన్నెలలో ఎదురుచూసే నీకై!
గతమంతా నీతోనే కలిసిపోయె
ఈ వేళ నా చెంతకు రాకుంటివేల?
వెన్నెల కిరణాలు సోకి
చక్కని చెక్కిళ్ళు మెరిసె!
పగడాల అధరాల
చిరునవ్వు విరిసె..
కంఠి నా కంఠాన బరువాయె
పోయె పైట నా ఎదపై
నిలువక పోయె
ఈ వేళ ఈ విరహము
నేనోపలేనోయి..
చలిగాలి నాలోన
సెగ రేపుతుంటే
సరిగాను నీవేను
నా తోడు నీడ!
సోగ కన్నుల లోన
నిన్ను దాచుకొంటి
సొగసైన ఎదలోన
నన్నేల దాచవోయి..
చిరుమువ్వల సవ్వడి పాదాలు
నిన్ను రమ్మని పిలిచే ఆనవాలుగా
కురులు చేసెను ఝుమ్మనినాదం
పువు పూవున కెగిరి
తుమ్మెద సేకరించిన
మధువు మత్తెక్కినట్లు..
పండువెన్నెల
నవ్వుతుంటే ఫక్కుమని!
నిండు మనసు చెబుతుండె
నీకే మనసీయమని..
ఇన్ని మాటలేలరా
ఇంత అర్ధరేతిరి దాకా
ఎదురు చూసి అలసి పోతి!
నీ కౌగిట కరగాలని
నీలోనే కలవాలని
ఆలసించక అరుదెంచి
చేరదీయరా చెలికాడా..

- రావినూతల జగదీశ్వరి

హెచ్చును ప్రేమలు

చం. చెలిమివినోదమైనిలుపుచేయునిరీక్షణకొత్తకోణముల్
వలపుల తీపి జ్ఞాపికలు వాక్కులనోర్మిమహోపకారమౌ
తలపుల తల్లి కోసమని దారుల జూచుట పిల్లలందునన్
విలువలు జెప్పుగొప్ప తమ పేర్మిని పంచుచునొక్కమారుగన్!!.
ఆ.వె. ఎదురుచూపులోన హెచ్చును ప్రేమలు
కష్టసుఖములందు కనులలోన
నిముషమొక్క యుగము నిలదీయు భవితను
కలిసినంత మిగుల కలుగు ముదము!!.
ఉ. దేశము గాచు సైనికుడు దిక్కుల వెంబడి సేవ లోపలన్
పాశము వీడకన్ గృహము భార్యయు పిల్లలు తల్లి దండ్రులం
దాశ నిరీక్షణన్ తనివినాత్మసమీక్షయె తీపిబాధతో
క్లేశము ద్రుంచు సౌఖ్యమును ప్రేమమయమ్ముసుఖాంతమయ్యెడిన్!.
కం. సినిమా చూడగ వెడలిన
ననుమానముతోడభార్యలాలోచనలో
మనము నిరీక్షణ కరినము
తనివిని గూర్చదు మనిషికి ధైర్యము సడలున్!!.

-మాడుగుల నారాయణ మూర్తి

వీడుకోలు

చంద్రుడి కోసం చకోరం
ప్రియుడి
ప్రేమలేఖకై ప్రియురాలు
ప్రియురాలి రాకకై ప్రియుడు
విదేశాల్లో ఉన్న కన్నకొడుకు
ఇంటికి తిరిగి వస్తుంటే
తల్లిదండ్రుల ఎదురుచూపులు!!
ఉదయభాస్కరుని కోసం
ఎదురుచూసే పొద్దుతిరుగుడు పువ్వు
వానదేవుడి కోసం మబ్బుల్లోకి
ఆశగా చూసే రైతన్న
గోపాలుని కోసం గోపికల నిరీక్షణ
బృందావనిలో రాధమ్మ ఆలాపన!!
ఆ నిరీక్షణలో
ఎంత ఆనందం!
ఎంత గొప్ప అనుభూతి!.
రైల్వే స్టేషన్ కు ముందే వెళ్లి కూచుని
రైలు కోసం ఎదురుచూపులు
ఫలానా ప్లాట్ ఫారానికి
ట్రైన్ వస్తుందనగానే
ఆ ప్లాట్ ఫారానికి పరుగులు
ఎదురుచూసిన ఆ రైలు
కూత పెడుతూ
స్టేషన్ లోకి వస్తుంటే
ఆనందంతో కూడిన ఉద్వేగం!!
తాంబూలాలు పుచ్చుకున్నాక
కళ్యాణ ఘడియకై
వధూవరుల నిరీక్షణ!!
ఎక్కబోయే బస్ కోసం
బస్టాండ్ లో నిరీక్షణ
వచ్చిన ప్రతి బస్సు
నంబర్ చూస్తూ
అడుగడుగునా ఆరాటం
కాలంతో పోరాటం!!
దేవుని మందిరం చేరాలని
సుమబాలల నిరీక్షణ
పరీక్ష రాసిన విద్యార్థి ఫలితాల కై
పరీక్ష రాసిన ఉద్యోగార్థి
అర్హత కోసం నిరీక్షణ!!
నొప్పులు పడుతున్న
ఒక చూలింతరాలు
కాన్పు కై నిరీక్షణ
కాలేజీకి వెళ్లిన అమ్మ
ఎప్పుడొస్తదని
అమ్మకోసం ఎదురుచూస్తున్న
రెండేళ్ల కూతురి ప్రశ్న
మధురమైన తలపులు
తిరిగిరాని ఆ రోజులు!!
బాల్యం నుండీ వార్ధక్యం దాకా
ప్రతి దశలో
దేనికో
ఎందుకో
జీవితమంతా ఎదురు చూపులే!!
చూపులు కలిసిన శుభవేళ
ఎదురుచూపులకు
వీడుకోలు!!.

-పరిమి వెంకట సత్యమూర్తి

గెలుపుకు మలుపు

క్షణాలు యుగాలుగా
కదలని కాలం
సహనానికి పరీక్ష
నిరీక్షణ ఒక శిక్ష!!.
సమయానికి ఎన్నో ఆటంకాలు
అడుగడుగునా అవరోధాలు
అనుకున్న సమయం చేయిదాటితే
విరామం లేని విసుగు
ఎందుకు
ఏమిటి
కారణాల కొరకు వెతుకులాట
మనసులో ఆందోళన
ఎన్నెన్నో ఆలోచనలు
నిరీక్షణ ఒక పరీక్ష!!.
ప్రియునికోసం ప్రియురాలు
ప్రియురాలికోసం ప్రియుడు
లోకం తెలియని ప్రేమ
స్వేచ్ఛగా ఎగిరే పక్షులు
ఒక చోట కలుసుకోవాలని
సంకేత స్థలంలో నిలబడి
ఎదురుచూసే వేళ
ఒళ్ళంతా కళ్ళు
క్షణక్షణం ఆరాటం
కాలాన్ని ఒడిసిపట్టి
కలుసుకున్న వేళ
తీయని అనుభూతి
అనురాగానికి
నిరీక్షణ ఒక వల!!.
ఏదో తెస్తాడని
తండ్రి కోసం పిల్లలు
భర్త కొరకు భార్య
ఒకరికోసం ఒకరు
ఎదురుచూపులు
నిరీక్షణ ఒక వరం!!.
గడవని కాలం
చూసిచూసి
వేచి వేచి
అలసి
వాలిపోతున్న కలువ కన్నులు
సొలసిన మనో కుసుమం
తీయని మధురానుభూతి
ఎదురుచూపులు
ఎంతో ఆనందం!!.
సూర్యునికై కమలం
విప్పారుతున్న కనులతో నిరీక్షణ
చంద్రునివెన్నెల కిరణాలకై
కలువ నిరీక్షణ
వసంతం కొరకు
తరుభామల నిరీక్షణ
కృష్ణునికై ఎదురుచూపులతో తపించిన
రాధ
ప్రకృతిలో ప్రతీ హృదయం
ఏదో సాధించుటకై
నిరీక్షణ ఆయుధాన్ని చేపట్టి
విజయం సాధించుటకై ప్రయత్నమే
బలం ఎక్కుపెట్టడమే
గెలుపుకు మలుపు నిరీక్షణే!!.

- డా. చీదెళ్ళ సీతాలక్ష్మి

అయోమయం

నిరీక్షణ..
పరీక్షా ఫలితాల కొరకు
ఉద్యోగ వేటలో
ఇంటర్వ్యూ ఫలితాలకొరకు
పెళ్ళిచూపుల తరువాత
అవతలివారినుండి సమాధానం కోసం
చిన్న పండ్ల మొక్కను పెట్టి
రోజూ నీళ్ళూ ఎరువులూ ఇస్తూ
ఎప్పుడు పెద్దదై
ఎప్పుడు కాయలు కాస్తుందోనని
రోజు వచ్చే టైముకు రాని
పిల్లలకోసం ఆలోచిస్తూ
ఏదైనా మనకిష్టమైన కార్యక్రమం
తొందరగా జరిగితే
బాగుండని ఎదురుచూస్తూ
మనవారు
ఆస్పత్రిలో
చికిత్స చేయించుకుంటున్నప్పుడు
ఇంకెప్పుడు నయమౌతుందోనని
మనకిష్టం లేకున్నా
కొందరిని మనింట్లో
తప్పక ఉంచుకోవాల్సివచ్చినపుడు
ఎప్పుడు పోతారా అని ఎదురుచూస్తూ
మనకిష్టమైనవారు చదువుల కోసమో
ఉద్యోగం నిమిత్తమో వ్యాపారం కొరకో
ఇతర ప్రాంతాలకు వెళ్ళినపుడు
వారికోసం రోజుకో యుగంలా
ఎదురు చూస్తూ
నిరీక్షణ-
ఒక్కోసారి భయకారకం
మనమేదైనా పనిచేస్తామని హామీ ఇచ్చి
సమయానికి చేయలేకపోయినప్పుడు
వారు వచ్చే టైముకు
ఏం చెప్పాలో తెలియని
అయోమయంతో.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

ఎదురుచూపు

ఎదురుచూపు తీయన
ఫలించగానే
మరింత మధురమార్పు
మనస్సులను
మైమరపించడమే తెలుసు ;
ఎక్కడి నుంచో
సొంతూరుకి వస్తున్న కన్నబిడ్డడి కోసం
తల్లి కళ్ళల్లో ఒత్తులేసుకుని
చూస్తున్న తల్లిదండ్రుల ఎదురుచూపు
తమ బాగు కోసం
దూరాలు
దివారాత్రాల పరిశ్రమా
ఇష్టమే నంటూ
దూరతీరాలకు పయనించిన భర్త
రాకకోసం భార్య చూస్తున్న
ఎదురు చూపు
జన్మ నిచ్చిన ఊరునూ
తల్లిదండ్రులనూ బంధుమిత్రులనూ
కలుసుకోవాలనీ
తనివితీరా
కష్టసుఖాలు కలబోసుకోవాలనీ
రాకపోకల దారులు
తెరుచుకోవాలనీ
వెయ్యి కళ్ళతో చూస్తున్న
వేలాదిమంది ఎదురుచూపు
ఫలిస్తుందో లేదోనని
వర్తమాన కాలంలో వేధిస్తున్న
సందేహం.

- ముద్దు వెంకటలక్ష్మి

ఇదేనేమో!

అప్పటిదాకా
రోజులకొద్దీ
ఊహూ
నెలలకొద్దీ
సాగిన మానసిక ఒత్తిడికి
నిరీక్షణకు తెరదించుతూ!
గంటల కొద్దీ పడిన
శారీరక బాధను మరిపిస్తూ!
సృష్టి అద్భుతాన్ని
కనుల ముందు నిలుపుతూ!.
గుప్పిళ్ళు మూసిన
లేత చేతులు
మృదువైన అరిపాదాలు!.
అరమోడ్పు కనులతో
చిరునవ్వులు చిందిస్తూ
ముద్దులు మూటగట్టిన మోము!.
నాలో పెరిగిన నా జీవం
నా ఊపిరిలో ఊపిరై
రక్తంలో రక్తంగా పెరిగిన
నా అంశ!.
రూపమెలాగుందో
తెలియకపోయినా
నాతో కలిసి నివసించిన
నా ప్రాణం!.
నాలోనే దాగున్నది
నేడు విడివడి
నా ఒడిన
కనులవిందుగా!.
తనివితీరా హత్తుకోవాలని
ఒడిలోకి తీసుకుని ముద్దాడాలని
తనువు తహతహలాడుతోంది
ఎదలో ఏదో ఉప్పొంగుతోంది!
ఈ అనుభూతేనేమో
ప్రేమంటే?!
ఈ భావనేనేమో
మమతంటే?!
మమకారమంటే?!
ఈ ఉద్వేగమేనేమో
వాత్సల్యమంటే?!
నిరీక్షణ ఫలించిన వేళ
మదిలో ఉప్పొంగెను
ఆనందోత్సాహాల హేల!!!.

-చంద్రకళ దీకొండ

సదా ఆలోచన

మనిషి ప్రతి అంశానికి
ఎదురుచూపులోనే ఆనందం
పుట్టే బిడ్డ కోసం
తొమ్మిది నెలల ఎదురు చూపు
పరీక్షల ఫలితాల కోసం
ఎన్నో విధాల ఆలోచనలు.
ఉద్యోగాన్వేషణలో యోచనలు
పెళ్లి సంబంధాలలో
మంచి వారి కోసం అన్వేషణ
జీవితంలో ఎదుగుదల
పదోన్నతి కోసం నిరీక్షణ
జీవితంలో ఎన్నో నిరీక్షణలు
విదేశాలకు పరుగులు
ఆనందక్షణాలు
అవార్డుల కోసం సాధన
శోధనలో
ఎంతో నిరీక్షణ అవసరమే.
క్షణం క్షణం
ప్రతి పనికోసం
తప్పనిసరి నిరీక్షణ.
కాల మార్పును
గడియారం ముళ్ళ చుట్టూ
నిరీక్షించడమే!.

-నారుమంచి వాణీప్రభాకరి

జీవికి మోక్షం

ఆనందం వెల్లివిరిచే క్షణం
మనిషి పుట్టుకే ఒక నిరీక్షణ
ఉండాలి మనిషికి క్రమశిక్షణ
చేరుకోవడానికి ఉన్నత శిఖరం
తేవాలి ఆశయాలకు ఆచరణ
చేయకూడదు కాలక్షేపం
రాకుండా ఎక్కడా నిరీక్షణ.
రవి కిరణాల కోసం
కలువరేడు నిరీక్షణ
పాలపాకెట్ కోసం ఇల్లాలి నిరీక్షణ
వార్తాపత్రిక కోసం ఇంటిపెద్ద నిరీక్షణ
ఒకరి కోసం ఒకరు ప్రేమికుల నిరీక్షణ,
పిల్లల స్కూల్ అడ్మిషన్ కోసం
తల్లితండ్రుల నిరీక్షణ
స్కూల్ బస్ కోసం
విద్యార్థుల నిరీక్షణ
నిరుద్యోగులు ఉద్యోగాలకి నిరీక్షణ
ఉద్యోగస్తులు ప్రమోషన్ కోసం నిరీక్షణ
హాస్పిటల్స్ దగ్గర రోగుల నిరీక్షణ
వృద్ధాప్యంలో తమ పిల్లల
ప్రేమ ఆప్యాయతల కోసం
పెద్దల నిరీక్షణ
లేదంటే
తమ చివరి మజిలీ కోసం నిరీక్షణ
అందరి జీవితాలలో
మంచి జరగాలని నిరీక్షణ
పుట్టుక నుండి గిట్టే వరకు
నిరంతరం నిరీక్షణ
ఆత్మ దేవునిలో ఐక్యం అయ్యేవరకు
అన్నిటా నిరీక్షణనే.
నిరీక్షణలో
విముక్తితో జీవికి మోక్షం.

-ఆర్. ఎస్. చంద్రావతి

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
(నేటినిజం ప్రతినిధి)

'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి (ప్రథమ)

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

మధుర ధార....

గతించిన కాలగమనంలో
మదించిన జ్ఞాపకాల తెరలు
మధుర ధారలై
మనసు తడిలో
పదేపదే పరవశిస్తుంటే...!
కొన్నిజ్ఞాపకాలు నాలోఉత్తేజమై
నిత్య తేజాన్ని కుమ్మరిస్తుంది
కొన్నిజ్ఞాపకాలు భయానక భ్రాంతియై
నిత్యచలనం లేని నిర్వీర్య
దారులొతుంది...!
ఏమి చిత్రమో...!
ఈ తతంగ
మనసు వీక్షణం
అపుడే బతికిస్తుంది...
అపుడే చంపేస్తుంది..
రేపటి రూపుకు ఉక్కిరి బిక్కిరి చేసి
ఉరుకులాడుతుంది...
కొత్త దారుల లోకం కోసమై
పరిచిన తివాచీలా
నాలో గిలిగింతల తుంపరలను
జల్లుతుంది....
ఎంత ఆనందమో...!
గుండె నిండా ఆత్మస్థైర్యపు
ఎజెండానే నింపుతుంది...!
మరుపురాని మధుర జ్ఞాపకాలు
తీపిచేదుల కన్నీళ్ళ ఊటకు
మధురధారలుగా స్రవంచి,
జీవన స్రవంతికి శక్తియుక్తుల
నీడనిచ్చి గొప్ప ఆత్మీయతను
పంచుతుంది....!
ఈ తీపిలోగిలిని ముద్దాడని
మనిషిలేడని తనలోతానే
తన్మయత్వంలో
తనువునూగిస్తుంది, ఆడిస్తుంది....
మనసుతీరంలో మైకం కమ్మే
కమ్మని రహదారుల పూలెన్నో
ఏరుకోవచ్చు...
అందుకే....! కమ్మని జ్ఞాపకాలు
మధుర దారలై నాలో ఆగని
వర్షధారల్లా
కురుస్తూనే ఉంది.....!!.

-చిందం సునీత

మరుపురాని మధుర జ్ఞాపకాలు.

నా బాల్యం
మధురం సుమధురం
అణువు అణువు
అందమైన బృందావనం
మా నిలయం.
అన్న అక్కలతో
ఆట పాటలు.
ఆకతాయి అల్లరి
అనురాగంతో అల్లుకున్న
నేస్తాలు
తియ్యని మధురస్మృతులు
ఆత్మీయత బంధాలు
సరదాసరదాగా కబుర్లు
నా తల్లిదండ్రులు దిద్దిన
ఓనమాల